

www.epapersamayam.com

APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక

తెలుగు దినపత్రిక

SAMAYAM

సంపుటి : 18 | సంచిక : 189 | ఎడిటర్ : విక్రం కుమార్ | మంగళవారం 18 మార్చి 2025 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 8 | వెల: రూ.5

## రాష్ట్రం యూనిట్‌గా
# ఎస్సీ వర్గీకరణ...



- 2011 జనాభా లెక్కల ప్రాతిపదికన అమలు
- ఏ, బీ, సీ.. మూడు కేటగిరీలుగా రిజర్వేషన్
- రెల్లి, ఉపకులాలకు 1%
- మాల, ఉపకులాలకు 7.5 శాతం
- మాదిగ, ఉపకులాలకు 6.5%..
- మంత్రుల సంఘం సిఫారసుల్ని ఆమోదించిన క్యాబినెట్
- 20న అసెంబ్లీలో చర్చ.. తీర్మానం
- తదుపరి జాతీయ ఎస్సీ కమిషన్‌కు నివేదన
- బేడ, బుడగ జంగాలను రెల్లి కేటగిరీలో చేర్చే ప్రతిపాదన

2లో



## అమరావతి, తిరుపతిల్లోనూ
# లులు మాల్స్!

* ఆ సంస్థ సానుకూలంగా ఉందని సీఎం వెల్లడి
* విద్యార్థుల స్టార్టప్ సంస్థలకు ఆర్థిక సాయం
* రాజధానిలో రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్
* మంత్రివర్గ సమావేశంలో నిర్ణయాలు

2లో

# రక్షణ భాగస్వామ్యం బలోపేతం

- భారత్, న్యూజిలాండ్ ప్రధానుల ఉద్ఘాటన
- మోదీతో క్రిస్టోఫర్ లక్సాన్ భేటీ

సమయం న్యూస్, దిల్లీ: రక్షణ రంగంలో భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకుని సంస్థాగతపరచుకోవాలని భారత్, న్యూజిలాండ్ నిర్ణయించుకున్నాయి. మనదేశ పర్యటనకు వచ్చిన న్యూజిలాండ్ ప్రధానమంత్రి క్రిస్టోఫర్ లక్సాన్ సోమవారం ప్రధాని నరేంద్రమోదీతో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా విద్య, క్రీడలు, వ్యవసాయం, వాతావరణ మార్పుల వంటి రంగాలకు

తరువాయి 2లో



## జాన్.ఎఫ్ కెన్నడీ హత్య కేసు రహస్యాలు.. నేడు వెల్లడి

- : ట్రంప్



వాషింగ్టన్: అమెరికా మాజీ అధ్యక్షుడు జాన్ ఎఫ్. కెన్నడీ హత్య కేసుకు సంబంధించిన దస్త్రాలను ఈ రోజు విడుదల చేయనున్నట్లు అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. తన యంత్రాంగం ఆ దస్త్రాలను ప్రజల ముందు ఉంచుతుందని తెలిపారు. వాషింగ్టన్‌లోని కెన్నడీ పేరు మీదున్న కళల ప్రదర్శన వేదిక అయిన కెన్నడీ సెంటర్‌ను ట్రంప్ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా కెన్నడీ హత్యకు సంబంధించి అన్ని దస్త్రాలను నేడు బయటపెడుతున్నట్లు మీడియా ఎదుట ట్రంప్ వెల్లడించారు. గత జనవరిలో ట్రంప్ రెండో సారి అధ్యక్ష బాధ్యతలు చేపట్టాక పలు కార్యనిర్వాహక ఉత్తర్వులపై సంతకం చేసిన విషయం తెలిసిందే. అందులో భాగంగా మాజీ అధ్యక్షుడు జాన్ ఎఫ్. కెన్నడీ, మాజీ సెనెటర్ రాబర్ట్ ఎఫ్.కెన్నడీ, పౌర హక్కుల కార్యకర్త మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ హత్యలకు సంబంధించిన దస్త్రాలను బహిర్గతం

తరువాయి 2లో




## బీసీ రిజర్వేషన్ల బిల్లులకు
# శాసనసభ ఏకగ్రీవ ఆమోదం

- 42% సాధించేవరకు విశ్రమించబోమన్న సీఎం రేవంత్‌రెడ్డి
- కేంద్రం ఆమోదించాలని ప్రధానికి లేఖ
- మద్దతు కోసం అఖిలపక్షంతో కలుస్తామని విన్నపం
- నేడు సభలో చర్చకు

### రానున్న ఎస్సీ వర్గీకరణ బిల్లు

సమయం న్యూస్, హైదరాబాద్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు సంబంధించిన బిల్లులకు తెలంగాణ శాసనసభ సోమవారం ఏక గ్రీవంగా ఆమోదం తెలిపింది. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అధ్యక్షతన సమావేశమైన సభలో మొత్తం ఐదు బిల్లులను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. తెలంగాణ వెనుకబడిన తరగతులు, షెడ్యూల్డు కులాలు, తెగలకు విద్యాసంస్థల్లో సీట్లు, రాష్ట్ర సర్వీసుల్లో

తరువాయి 2లో

## పారదర్శకంగా
# రాజీవ్ యువ వికాసం

- 5 లక్షల మందికి ఉపాధి కల్పనే లక్ష్యం
- జూన్ 2న లబ్ధిదారుల జాబితా
- అబద్ధాల పునాదులపై ప్రభుత్వాన్ని నడపలేం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- 'రాజీవ్ యువ వికాసం' పథకం ప్రారంభం

సమయం న్యూస్, హైదరాబాద్: రాజీవ్ యువ వికాసం పథకాన్ని పారదర్శకంగా అమలు చేస్తేనే ప్రజలకు తమపై నమ్మకం కలుగుతుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. రూ.6 వేల కోట్లతో 5 లక్షల మంది నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడానికి ఈ పథకం ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. సోమవారం సాయంత్రం అసెంబ్లీ ఆవరణలో యువ వికాసం పథకాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఉప ముఖ్య మంత్రి భట్టివిక్రమార్క, మంత్రులు సీతక్క, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, ఎంఐఎం నేత అక్బరుద్దీన్ ఒవైసీ సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. "చదువుకుని చైతన్యం ఉన్నవారికి రూ.4 లక్షల వరకూ ఈ పథకం కింద ఇస్తున్నాం. ప్రతి నియోజకవర్గానికి

తరువాయి 2లో






## రేపు భూమి మీదకు సునీతా విలియమ్స్

కేప్ కెనావెరాల్: వ్యోమనౌక మొరాయించడంతో దాదాపు 9 నెలల పాటు అంతరిక్షంలో చిక్కుకుపోయిన భారత సంతతికి చెందిన సునీతా విలియమ్స్, మరో వ్యోమగామి బుచ్ విల్మోర్ తిరుగుప్రయాణానికి ముహూర్తం ఖరారైంది. మరో ఇద్దరు ఆస్ట్రోనాట్‌లతో కలిసి వారు బుధవారం తెల్లవారుజామున 3.27 గంటలకు (భారత కాలమానం ప్రకారం) పుడమికి చేరుకుంటారని అమెరికా అంతరిక్ష సంస్థనాసా సోమవారం

తరువాయి 2లో



## సుప్రీం న్యాయమూర్తిగా జస్టిస్ జోయ్‌మల్యా ప్రమాణం

సమయం న్యూస్, దిల్లీ: సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయనతో భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సంజీవ్ ఖన్నా ప్రమాణం చేయించారు. జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీ ఇప్పటివరకూ కలకత్తా హైకోర్టు సీనియర్ న్యాయమూర్తిగా కొనసాగారు. ఆయన నియామకంతో సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల సంఖ్య 33కు చేరింది. జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీ ఆరేళ్లకు పైగా సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా కొనసాగనున్నారు. ఆ వ్యవధిలో ఆయన సీజేఐగా పదోన్నతి పొందే అవకాశం ఉంది.

## ఏపీ సహా 4 రాష్ట్రాల ఎంపీలకు
# రాష్ట్రపతి తేనీటి విందు

సమయం న్యూస్, దిల్లీ: ఆంధ్రప్రదేశ్, కేరళ, కర్ణాటక, హరియాణాలకు చెందిన లోక్‌సభ, రాజ్యసభ సభ్యులకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సోమవారం ఉదయం తేనీటి విందు ఇచ్చారు. ప్రస్తుతం పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు జరుగుతున్న తరుణంలో వివిధ రాష్ట్రాల ఎంపీల గౌరవార్థం విడతలవారీగా ఏర్పాటుచేస్తున్న ఈ కార్యక్రమంలో భాగంగా ఇప్పుడు ఈ నాలుగు రాష్ట్రాల ఎంపీలను ఆహ్వానించారు. ఇందులో లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా, కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, భాజపా అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జేపీ నడ్డా, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజూ, సహాయ మంత్రులు అర్జున్‌రామ్ మేఘ్‌వాల్, ఎల్.మురుగన్, హరియాణాకు చెందిన కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్, ఏపీ నుంచి కె.రామ్మోహన్‌నా

తరువాయి 2లో



# పారదర్శకంగా రాజీవ్ యువ వికాసం

(మొదటిపేజీ తరువాయి)

4 వేల నుంచి 5 వేల మందికి పని కల్పించవచ్చు. అయితే, ఐదంతస్తుల భవనం ఉన్నవారికి ఈ పథకం వర్తింప జేస్తామంటే కుదరదు. గతంలో అలా చేసినవారు ఎక్కడున్నారో మీరు చూశారు. అర్హులైన నిరుద్యోగులకు ఈ పథకం అందాలి.

*** ఆర్థికంగా చాలా ఇబ్బందులున్నాయి...**

ఆర్థికంగా చాలా ఇబ్బందులున్నందువల్ల ప్రజలకు వాస్తవాలను వివరించి దుబారాను తగ్గించాలని కార్యాచరణ నిర్ణయించుకున్నాం. ప్రభుత్వ ఆదాయంపై వేసిన అంచనాలు తప్పాయి. అబద్ధాల పునాదులపై ఎన్ని రోజులు ప్రభుత్వాన్ని నడుపుతాం. భారాస పాలనలో పన్నులు సరిగ్గా వసూలు చేయలేదు. ఆదాయం పెంపు గురించి పట్టించుకోలేదు. మేం 14 నెలలుగా గత ప్రభుత్వ విధానంలోనే ఇసుకపై పన్ను వసూలు చేశాం. గత నెల రోజులుగా నేను గట్టిగా దృష్టి పెడితే రోజువారీ ఆదాయం రూ.కోటిన్నర నుంచి రూ.మూడున్నర కోట్లకు పెరి గింది. రాష్ట్ర పన్నుల వసూళ్లలో 88 శాతంతో దేశంలోనే తెలంగాణ అగ్రస్థానంలో ఉండగా.. మహారాష్ట్ర రెండో స్థానంలో ఉంది. ప్రధాని సొంత రాష్ట్రం గుజరాత్ 6 లేదా 7వ స్థానంలో ఉంది. రాష్ట్రంలో సింథటిక్ డ్రగ్స్, కొకైన్ ఎక్కువయ్యాయి. తెలంగాణ సమాజాన్ని అవి భయపెడుతున్నాయి. రాష్ట్రం వేగంగా పంజాబ్‌లా మారిపోతోంది. ఉద్యోగం, ఉపాధి లేక యువత వీటికి బానిసలవుతున్నారు. రాజీవ్ యువ వికాస పథకాన్ని సద్వినియోగం చేసుకుని.. తెలంగాణను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేసేందుకు అందరూ సహకరించాలి. ఐటీఐల్లో అడ్వాన్స్డ్ శిక్షణ కేంద్రాలు ప్రారంభించాం. వీటిలో శిక్షణ పొందినవారికి యువ వికాసంలో ప్రాధాన్యమివ్వాలి. ముస్లిం మైనారిటీలకు వారి వాటా మేరకు పథకాల్లో సముచిత న్యాయం చేస్తాం.

*** ఆరోపణలు లేకుండా బదిలీలు చేపట్టాం**

ఆరోపణలు రాకుండా కలెక్టర్‌ను బదిలీ చేయగలం కానీ, ఒక్క టీచర్‌ను కూడా బదిలీ చేయలేం. అన్ని శాఖల్లో ఏళ్లుగా పేరుకుపోయిన బదిలీలను మా ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎలాంటి ఆరోపణలు రాకుండా చేపట్టాం. 22 వేల మంది టీచర్లకు పదోన్నతులు ఇచ్చాం. 36 వేల మందిని బదిలీ చేశాం. కులగణన చేయడం వల్లే ఎమ్మెల్సీలుగా బలహీనవర్గాలకు చెందిన ఐదుగురు ఎన్నికయ్యారు. ఇది తొలి అడుగు మాత్రమే. రాజీవ్ యువ వికాసం లబ్ధిదారుల జాబితాను జూన్ 2న ప్రకటిస్తాం'' అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

*** జూన్ 2న మంజూరు పత్రాల పంపిణీ: భట్టి**

రాజీవ్ యువ వికాసం పథకం లబ్ధిదారులకు జూన్ 2న ఆర్థిక సాయం మంజూరు పత్రాలు పంపిణీ చేస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు. యువ వికాసం పోర్టల్ నుంచి దరఖాస్తులను డౌన్‌లోడ్ చేసుకొని, మండల పరిషత్ కార్యాలయంలో అధికారులకు సమర్పించాలని నిరుద్యోగులకు ఆయన సూచించారు. ''గత ప్రభుత్వ హయాంలో పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఉద్యోగ నోటిఫికేషన్‌లు విడుదల చేయాలని ధర్నాలు చేసే పరిస్థితి ఉండేది. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రకటించిన జాబ్ క్యాలెండర్ ప్రకారం నోటిఫికేషన్లు విడుదల చేయడం వల్ల పోటీ పరీక్షలకు ఒకేసారి సిద్ధం కావడం ఇబ్బందిగా ఉందని, నోటిఫికేషన్ల మధ్య కొంచెం విరామం ఇవ్వాలని కోరుతూ ఆందోళన చేసేలా విరివిగా నోటిఫికేషన్లు ఇచ్చే పరిస్థితి తెచ్చాం'' అని ఆయన పేర్కొన్నారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ ఉద్యోగాల కల్పనపై ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నామని, హామీలను నెరవేరుస్తూ ప్రభుత్వం పాలన సాగిస్తోందని అన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రాజీవ్ యువ వికాస పథకాన్ని పారదర్శకంగా అమలు చేయాలని కోరారు.

# బీసీ రిజర్వేషన్ల బిల్లులకు శాసనసభ ఏకగ్రీవ ఆమోదం

(మొదటిపేజీ తరువాయి)

నియామకాలు 2025, గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు 2025 బిల్లులు రెండింటినీ కలిపి సభలో చర్చించారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ బిల్లులను సభలో ప్రవేశపెట్టారు. వీటిపై చర్చించిన అనంతరం అన్ని పక్షాలు ఆమోదం తెలిపాయి. ఈ బిల్లులను శాసనమండలి ఆమోదించిన అనంతరం (బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పన) పార్లమెంట్ ఆమోదానికి పంపనున్నారు. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. సోమవారం ప్రధాని మోదీకి లేఖ రాశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు కేంద్రం ఆమోదం తెలపాలని, అఖిలపక్షంతో వచ్చి కలిసేందుకు అనుమతించాలని అందులో విన్నవించారు.

*** మరో మూడు బిల్లులు...**

ఈ రెండు బిల్లులతో పాటు.. మరో మూడు బిల్లులను సోమవారం శాసనసభలో ప్రవేశపెట్టారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ సవరణ బిల్లు 2025ను వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రవేశపెట్టగా.. విశ్వవిద్యాలయం పేరును సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంగా మార్చుతూ బిల్లును సభ ఆమోదించింది. తెలంగాణ షెడ్యూల్డు కులాల బిల్లు (ఎస్సీ వర్గీకరణ) 2025, తెలంగాణ ధార్మిక హిందూ మత సంస్థల ధర్మాదాయములు 2025 బిల్లులను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. వీటిపై మంగళవారం సభ చర్చించనుంది.

*** ఏకాభిప్రాయానికి ధన్యావాదాలు: సీఎం**

అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్ల బిల్లు ప్రవేశపెట్టిన సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలోని ఉద్యోగాలు, ఉన్నత విద్య కోర్సుల్లో సీట్లు, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలయ్యేవరకు.. దాన్ని సాధించేవరకు విశ్రమించేదిలేదని తెలిపారు. ఏ వివాదాలకూ తావు లేకుండా బీసీలకు న్యాయం చేయడమే తమ విధానమన్నారు. అన్ని పార్టీల నేతలు బీసీలకు రిజర్వేషన్ పెంపుపై జెండాలు, ఎజెండాలు, సిద్ధాంతాలను పక్కనబెట్టి ఏకాభిప్రాయం తెలియజేసినందుకు ధన్యావాదాలు చెబుతున్నానన్నారు. బలహీన వర్గాలకు న్యాయం చేసేందుకు అన్ని పార్టీల వారు కలిసికట్టుగా ఉన్నామని సమాజానికి మంచి సంకేతం ఇచ్చారని ప్రశంసించారు.

*** రాహుల్‌గాంధీ హామీ మేరకు కులగణన**

''బీసీలకు రిజర్వేషన్ పెంపుపై కాంగ్రెస్ పార్టీ గతేడాది కామారెడ్డి డిక్లరేషన్‌ను ప్రకటించింది. దానికి కట్టుబడి ఉన్నాం. మా పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ 150 రోజులపాటు 4 వేల కి.మీ. పాదయాత్ర చేశారు. తమ పార్టీ అధికారంలోకి వచ్చిన రాష్ట్రాల్లో కులగణన చేసి 50 శాతం పరిమితికి మించి రిజర్వేషన్ పెంచుతామని హామీ ఇచ్చారు. ఆ ప్రకారమే రాష్ట్రంలో కులగణన జరిపాం. కొందరు పాల్గొనలేదని చెబితే మళ్లీ అవకాశం ఇచ్చాం. బీసీ కులగణన ప్రక్రియ ప్రారంభించిన ఫిబ్రవరి 4వ తేదీని ఏటా సామాజిక న్యాయ దినోత్సవంగా జరుపుకోవాలని ప్రకటించాం.

*** గత బిల్లును ఉపసంహరించుకుంటున్నాం**

గత ప్రభుత్వం 2017లో బీసీలకు 37 శాతం రిజర్వేషన్ కల్పించాలని బిల్లును ఆమోదించి గవర్నర్‌కు పంపింది. దాన్ని గవర్నర్.. రాష్ట్రపతి పరిశీలనకు పంపారు. అది అక్కడ పెండింగ్‌లో ఉన్నప్పుడు మరో చట్టం చేస్తే న్యాయపరమైన చిక్కులు వస్తాయి. అందుకే దాన్ని ఉపసంహరించుకుంటున్నాం. మండల్ కమిషన్ సిఫార్సుల మేరకు బీసీలకు 27 శాతం రిజర్వేషన్ అమల్లోకి వచ్చింది. ఉమ్మడి ఏపీలో దాన్ని 29 శాతానికి పెంచారు. ఇప్పుడు ఏ వివాదాలకు తావు లేకుండా 42 శాతానికి పెంచి బీసీలకు న్యాయం చేయడమే మా విధానం.

*** త్వరలోనే అందరం ప్రధాని వద్దకు వెళదాం**

పార్లమెంటులో ఆమోదం పొందితేనే రిజర్వేషన్ పెంపు అమలవుతుంది. అందుకే శాసనసభ నాయకుడిగా కేసీఆర్‌కు, భాజపా నేతలకు విజ్ఞప్తి చేస్తున్నా. అందరం కలిసి ప్రధాని వద్దకు వెళ్లి రిజర్వేషన్ పెంపును సాధించుకుందాం. అందుకు నేను నాయకత్వం వహిస్తా. ఇప్పటికే 100కిపైగా రాజ్యాంగ సవరణలు చేసుకున్నాం. అందరం కలిసికట్టుగా వెళ్తే ఇది కూడా ఎందుకు సాధ్యం కాదు? ప్రధాని అపాయింట్‌మెంట్ ఇప్పించాలని కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లను కోరుతున్నా. అపాయింట్‌మెంట్ కోరుతూ ప్రధానికి లేఖ రాయాలని అధికారులను ఆదేశిస్తున్నా. బండి సంజయ్‌కు కూడా లేఖ కాపీ పంపండి. లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీని కలిసి విన్నవించేందుకు సమయం తీసుకునే బాధ్యతను పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌కు అప్పగిస్తున్నా. ప్రస్తుత పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లోనే రిజర్వేషన్ పెంపును ఆమోదించేలా చేసుకుందాం. రిజర్వేషన్లు 50 శాతం దాటవద్దని సుప్రీంకోర్టు ఎందుకు అంటుందంటే.. 50 శాతం దాటాలంటే అందుకు సరైన లెక్కలు ఉండాలి. కులాలవారీగా జనాభా లెక్కలు చెప్పకుండా రిజర్వేషన్ ఎలా పెంచుకుంటారని సర్వోన్నత న్యాయస్థానం అడుగుతోంది. రాష్ట్రంలో చేసిన కులగణన లెక్కలు సరైనవేనని హామీ ఇస్తున్నా. రాష్ట్రంలో మొత్తం 56.36 శాతం మంది బీసీలున్నారు. వారికి 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని బిల్లు పెట్టాం. దాన్ని సాధించేవరకు విశ్రమించేది లేదు'' అని రేవంత్‌రెడ్డి అన్నారు.

**కేంద్రం ఆమోదం తెలపాలి**

తెలంగాణలో స్థానిక సంస్థలతో పాటు విద్యఉద్యోగ రంగాల్లో వెనకబడిన తరగతులకు 42 శాతం రిజర్వేషన్ల పెంపుదలకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం ప్రధానమంత్రి నరేంద్రమోదీని కోరారు. సంబంధిత రెండు బిల్లులను తెలంగాణ శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించిందని, దీనికి కేంద్రం మద్దతు కోసం కాంగ్రెస్, భారాస, భాజపా, మజ్లిస్, సీపీఐ పార్టీల నాయకులతో ప్రధానిని కలిసేందుకు అనుమతించాలని విన్నవించారు. ఈ మేరకు ప్రధానికి లేఖ రాశారు. ''తెలంగాణవ్యాప్తంగా సామాజిక, విద్య, ఆర్థిక, ఉపాధి, రాజకీయ, కులగణనపై ఇంటింటా సమగ్ర సర్వే ప్రాతిపదికన రాష్ట్ర ప్రభుత్వం శాసనసభలో తీర్మానాన్ని ఆమోదించింది. సర్వేలో సేకరించిన డేటాను అధ్యయనం చేసిన అనంతరం దాని ఆధారంగా ప్రభుత్వం బీసీలకు స్థానిక సంస్థల్లో, విద్య, ఉద్యోగ నియామకాల్లో రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాలని నిర్ణయించింది. దీనికి అనుగుణంగా రెండు బిల్లులను ప్రవేశపెట్టాం. వీటికి అన్ని పార్టీల నుంచి సంపూర్ణ మద్దతు, ఆమోదం లభించాయి. దీనికి కేంద్ర ప్రభుత్వం మద్దతు అవసరమనే అభిప్రాయం వ్యక్తమైంది. మీ మద్దతు కోసం ఐదు పార్టీల ప్రతినిధి బృందంతో మిమ్మల్ని కలిసేందుకు వీలైనంత త్వరగా అనుమతించాలని కోరుతున్నాను'' అని రేవంత్ లేఖలో పేర్కొన్నారు.

*** సాంఘిక విప్లవానికి తెలంగాణ నాయకత్వం**

భారతదేశంలో సాంఘిక విప్లవానికి తెలంగాణ నాయకత్వం వహిస్తున్నందుకు గర్విస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం 'ఎక్స్'లో పేర్కొన్నారు. ''జనాభాలో తమ కులగణన జరగాలని, గుర్తింపు పొందాలనే వెనుకబడిన తరగతులకు చెందిన మా సోదరసోదరీమణుల ఆకాంక్ష ఎట్టకేలకు నెరవేరింది. తెలంగాణ శాసనసభ నాయకుడిగా, ముఖ్యమంత్రిగా.. రాష్ట్రంలో ఓబీసీల జనాభా 56.36 శాతం ఉన్నట్లు నేను సాధికారికంగా ప్రకటిస్తున్నా. ఓబీసీలకు విద్య, ఉద్యోగాలు, ఉపాధి, రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని నిర్ణయించుకున్నాం. చరిత్రకు సంఘీభావంగా.. చరిత్రాత్మక ఘటనలో సరైన ఛాంపియన్‌లుగా నిలుద్దాం'' అని ఎక్స్‌లో పేర్కొన్నారు.

# రాష్ట్రం యూనిట్‌గా ఎస్సీ వర్గీకరణ

(మొదటిపేజీ తరువాయి)

ఎస్సీ వర్గీకరణను 2011 జనాభా లెక్కల ప్రాతిపదికన రాష్ట్రం యూనిట్‌గా అమలు చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. వర్గీకరణను జిల్లా యూనిట్‌గా అమలు చేయాలని మొదట భావించింది. అయితే జిల్లాల విభజన తర్వాత కొత్త జిల్లాల్లో ఎస్సీల జనాభాపై కచ్చితమైన సమాచారం లేనందున రాష్ట్రం యూనిట్‌గా అమలు చేయాలని నిర్ణయం తీసుకుంది. 2026 జనాభా గణన తర్వాత వర్గీకరణను జిల్లా యూనిట్‌గా అమలు చేసే విషయాన్ని పరిశీలించాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఎస్సీ వర్గీకరణను ఏ, బీ, సీ కేటగిరీలుగా విభజించి అమలు చేయనున్నారు. ఏ కేటగిరీలో రెల్లి, ఉపకులాలకు 1 శాతం రిజర్వేషన్.. బీ కేటగిరీలో మాదిగ, ఉపకులాలకు 6.5 శాతం.. సీ కేటగిరీలో మాల, ఉపకులాలకు 7.5 శాతం రిజర్వేషన్‌ను ప్రతిపాదిస్తూ రాజీవ్ రంజన్ మిశ్ర నేతృత్వంలోని ఏకసభ్య కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదించింది. విద్య, ఉద్యోగ నియామకాల్లో 200 రోస్టర్ పాయింట్లను ప్రతిపాదించింది. కమిషన్ నివేదికపై అధ్యయనానికి నియమించిన మంత్రుల సంఘం చేసిన సిఫారసుల్ని రాష్ట్ర మంత్రిమండలి సోమవారం ఆమోదించింది.

**సుదీర్ఘ చర్చ తర్వాత..**

వర్గీకరణ అమలుపై మంత్రివర్గ సమావేశంలో సుదీర్ఘ చర్చ జరిగింది. హోం మంత్రి అనిత, సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి అభిప్రాయాలను తీసుకున్నారు. డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల పెండింగ్, ఎస్సీ ఉపప్రణాళిక నిధుల కేటాయింపులో జాప్యం, తదితర అంశాలన్నింటినీ పరిశీలించిన తర్వాత ప్రస్తుతానికి రాష్ట్రం యూనిట్‌గా ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఏక సభ్య కమిషన్ నివేదికపై ఈ నెల 20న అసెంబ్లీలో చర్చించనున్నారు. బేడ, బుడగ జంగాలను రెల్లి కేటగిరీ కింద చేర్చే అంశంపై కూడా అదే రోజు చర్చిస్తారు. వీటిపై తీర్మానాలు చేసి, జాతీయ ఎస్సీ కమిషన్‌కు నివేదిస్తారు. అసెంబ్లీ సమావేశాల తర్వాత ఆర్డినెన్స్ జారీ చేసే అవకాశముంది.

**'జిల్లా యూనిట్'కే ఎక్కువ మంది ఎమ్మెల్యేల మొగ్గు**

ఎస్సీ వర్గీకరణ అమలుపై సోమవారం ఉదయం అసెంబ్లీ ఆవరణలో తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ఎస్సీ ప్రజాప్రతినిధులతో సమావేశమయ్యారు. వారిలో ఎక్కువ మంది జిల్లా యూనిట్‌గా వర్గీకరణ అమలు చేయాలని కోరారు. సాయంత్రం మంత్రివర్గ సమావేశం అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబును ఎస్సీ ప్రజాప్రతినిధులు కలిసి అభినందించారు. వర్గీకరణ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని మీడియాతో చెప్పారు.

# జాన్.ఎఫ్ కెన్నడీ హత్య కేసు రహస్యాలు.. నేడు వెల్లడి: ట్రంప్

(మొదటిపేజీ తరువాయి)

చేయాలంటూ గత జనవరి 23న ఆదేశాలు జారీ చేశారు. కెన్నడీ హత్య జరిగి ఇప్పటికే 60 ఏళ్లకు పైనే అవుతోంది. అయినా ఆయన హత్యకు సంబంధించి పూర్తి వివరాలు వెల్లడి కాలేదు. గతంలో పలుమార్లు కెన్నడీ హత్యకు సంబంధించి దస్త్రాలు బయటపెడతానని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఎన్నికల సమయంలో సైతం ప్రస్తావన తెచ్చారు. ఈ నేపథ్యంలోనే సదరు రికార్డులను విడుదల చేయబోతున్నారు. అయితే ఆ పత్రాల్లో ఎలాంటి సమాచారం ఉందనే విషయాన్ని ట్రంప్ వెల్లడించలేదు. భారీ సంఖ్యలో మాత్రమే పత్రాలు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. చదవడానికి చాలా సమయం పడుతుందని మీడియాతో అన్నారు.

# అమరావతి, తిరుపతిల్లోనూ లులు మాల్స్!

అమరావతి: విశాఖతో పాటు అమరావతి, తిరుపతిల్లోనూ మాల్స్ ఏర్పాటుకు లులు సంస్థ సానుకూలంగా ఉంది. విశాఖలో లులు మాల్ ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రివర్గం సోమవారం ఆమోదముద్ర వేసింది. అమరావతి, తిరుపతిల్లోనూ మాల్స్ ఏర్పాటు చేయాలని ఆ సంస్థను కోరామని, సానుకూలంగా స్పందించిందని ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రివర్గ సమావేశంలో వెల్లడించారు. 201419 మధ్య అప్పటి తెదేపా ప్రభుత్వం కృషితో విశాఖలో లులు మాల్ ఏర్పాటుకు అంతా సిద్ధమైంది. సాగరతీరంలో ప్రభుత్వం స్థలం కేటాయించింది. 2019లో వైకాపా అధికారంలోకి వచ్చాక స్థలాన్ని లాక్కుని, ఆ సంస్థను వెళ్లగొట్టింది. ఆ చేదు అనుభవంతో ఏపీలో ఇంకెప్పుడూ పెట్టుబడులు పెట్టబోమని అప్పట్లో లులు సంస్థ ప్రతినబూనింది. కూటమి అధికారంలోకి వచ్చాక.. ప్రభుత్వంపై ఉన్న నమ్మకంతో మళ్లీ రాష్ట్రానికి వచ్చేందుకు లులు అంగీకరించింది. విశాఖలో మాల్ ప్రతిపాదనకు ఇటీవల రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమ్మతి తెలియజేసింది. దానికి కేబినెట్ ఇప్పుడు ఆమోదముద్ర వేసింది.

*** రాజధాని పనుల పునఃప్రారంభానికి ప్రధానిని ఆహ్వానించనున్న సీఎం**

రాజధాని అమరావతి నిర్మాణ పనుల్ని ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ప్రారంభించనున్నట్టు మంత్రివర్గానికి ముఖ్యమంత్రి తెలిపారు. ఆయనను ఆహ్వానించేందుకు మంగళవారం సాయంత్రం దిల్లీ వెళ్తున్నట్టు చెప్పారు. రాజధానిలో చేపట్టబోయే వివిధ పనులకు కేబినెట్ ఆమోదముద్ర వేసిన సందర్భంగా.. అమరావతి ఏ విధంగా స్వయం సమృద్ధి ప్రాజెక్టో ముఖ్యమంత్రి వివరించారు. ఇప్పటి వరకు ఎన్ని పనులకు టెండర్లు పిలిచారు, నిధుల సమీకరణ తదితర అంశాల్ని అధికారులు మంత్రివర్గానికి తెలియజేశారు. దిల్లీ పర్యటనలో భాగంగా ప్రధానితో పాటు, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కూడా సీఎం కలవనున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వివిధ పథకాలు, కార్యక్రమాల కింద రాష్ట్రానికి పెండింగ్‌లో ఉన్న నిధుల జాబితాను తీసుకెళుతున్నారు. ఆ నిధుల్ని వెంటనే విడుదల చేయాల్సిందిగా కోరనున్నారు.

*** పారదర్శకంగా ఉపాధ్యాయుల బదిలీలు..**

విద్యారంగంపై చర్చ సందర్భంగా.. ఉపాధ్యాయుల బదిలీల్ని ఆన్‌లైన్‌లో పారదర్శకంగా నిర్వహించనున్నట్టు సీఎం తెలిపారు. ఉపాధ్యాయుల పనితీరు ఆధారంగా బదిలీలు విధానం ప్రవేశపెడితే ఎలా ఉంటుందన్న చర్చ జరిగినట్టు తెలిసింది. దానిపై విద్యాశాఖ మంత్రి లోకేశ్ స్పందిస్తూ... కొన్నిచోట్ల మూడు తరగతులకు కలిపి ఒకే ఉపాధ్యాయుడు ఉన్నారని, అలాంటప్పుడు పనితీరు ఆధారంగా బదిలీలు ఇప్పట్లో సాధ్యం కాదని స్పష్టంచేసినట్టు సమాచారం. రాబోయే రోజుల్లో ఒక తరగతికి ఒక ఉపాధ్యాయుడిని ఏర్పాటు చేశాక, అప్పుడు కూడా సాధ్యాసాధ్యాలపై ఉపాధ్యాయ సంఘాలతో చర్చించాకే దానిపై ఒక నిర్ణయం తీసుకోగలమని ఆయన పేర్కొన్నట్టు తెలిసింది.

*** సౌర ఫలకాల తయారీలో స్వయం సమృద్ధి సాధించేందుకే..**

ఇండోసోల్ సంస్థకు సౌర ఫలకాల ఉత్పత్తి పరిశ్రమ ఏర్పాటుకి అనుమతివ్వడంపై మంత్రివర్గ సమావేశంలో చర్చ జరిగింది. రాష్ట్రంలోను, దేశంలోని ఇతర ప్రాంతాల్లోను భారీ ఎత్తున సౌర విద్యుత్ కేంద్రాలు ఏర్పాటవుతున్నందున రాబోయే రోజుల్లో సౌర ఫలకాలకు చాలా డిమాండ్ ఉంటుందని ముఖ్యమంత్రి పేర్కొన్నట్టు సమాచారం. చైనా నుంచి సౌర ఫలకాల దిగుమతుల్ని నిలిపివేసినందున.. ఆ రంగంలో స్వయంసమృద్ధి సాధించేందుకే ఇండోసోల్ వంటి భారీ సౌరఫలకాల పరిశ్రమకు అనుమతిచ్చామని ఆయనవివరించినట్టు తెలిసింది.

*** విద్యార్థుల్ని ప్రోత్సహించేందుకు స్టార్టప్ ఫండ్..**

స్టార్టప్ పాలసీకి కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. విద్యార్థులు ప్రారంభించే స్టార్టప్ సంస్థల్ని ప్రోత్సహించేందుకు, ఆర్థికంగా చేయూతనిచ్చేందుకు స్టార్టప్ ఫండ్‌ను ఏర్పాటు చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. స్టార్టప్‌ను బట్టి రూ.2 లక్షల నుంచి రూ.7 లక్షల వరకు సాయం అందించే అవకాశం ఉంది. రాజధాని అమరావతిలో రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌ను, ఐదు ప్రాంతీయ కేంద్రాల్ని ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంలో ఏర్పాటు చేస్తారు.

# ఏపీ సహా 4 రాష్ట్రాల ఎంపీలకు రాష్ట్రపతి తేనీటి విందు

(మొదటిపేజీ తరువాయి)

యుడు, కర్ణాటక నుంచి కేంద్ర మంత్రులు ప్రహ్లాద్‌జోషి, శోభా కరంద్లాజే, వి.సోమన్న, తెదేపా పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు, ఆ పార్టీ ఉభయసభల సభ్యులు, భాజపా రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ పురందేశ్వరి, ఎంపీ సీఎం రమేశ్, వైకాపా లోక్‌సభాపక్ష నేత పీవీ మిథున్‌రెడ్డి, ఆ పార్టీ ఉభయసభల సభ్యులు ఇందులో పాల్గొన్నారు. ప్రతి ఎంపీ వద్దకు రాష్ట్రపతి వచ్చి మర్యాదపూర్వకంగా పలకరించి యోగక్షేమాలు కనుక్కున్నారు.

# రక్షణ భాగస్వామ్యం బలోపేతం

(మొదటిపేజీ తరువాయి)

సంబంధించి ఆరు ఒప్పందాలపై ఇరుపక్షాలు సంతకాలు చేశాయి. ముఖ్యంగా రక్షణ రంగంలో, ఇండోపసిఫిక్ ప్రాంతంలో సహకార విస్తృతిపై వీరిద్దరూ చర్చించుకున్నారు. రక్షణరంగ పరిశ్రమల సహకారాన్ని పెంచుకునే మార్గసూచీ రూపొందించుకోవాలని నిర్ణయించుకున్నారు. కొందరు సంఘవిద్రోహ శక్తులు న్యూజిలాండ్‌లో భారత వ్యతిరేక, ఖలిస్థాన్ అనుకూల కార్యకలాపాలకు పాల్పడుతుండటంపై మోదీ ఆందోళన వ్యక్తంచేశారు.

**విస్తరణవాదం వద్దు.. అభివృద్ధి ముద్దు**

స్వేచ్ఛాయుత, సురక్షితమైన, సుసంపన్నమైన ఇండోపసిఫిక్ ప్రాంతానికి రెండు దేశాలూ సహకరించనున్నాయని మోదీ తెలిపారు. తాము విస్తరణవాదాన్ని కాకుండా అభివృద్ధి విధానాన్ని విశ్వసిస్తామని పేర్కొన్నారు. సార్వభౌమత్వాన్ని, ప్రాదేశిక సమగ్రతను గౌరవించే ఇండోపసిఫిక్‌కు తాము మద్దతు ఇస్తామని నేతలిద్దరూ పునరుద్ఘాటించారు. సమగ్ర, పరస్పర ప్రయోజనకర, భారీస్థాయి స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ)పై చర్చలు ప్రారంభం కావడాన్ని మోదీ, లక్సాన్ సంయుక్త ప్రకటనలో స్వాగతించారు. ఉగ్రవాదం, వేర్పాటువాదం, అతివాదాలకు వ్యతిరేకంగా సహకరించుకోవాలని, అలాంటి శక్తులపై కఠిన చర్యలు చేపట్టాలని మోదీ చెప్పారు. పాడి పరిశ్రమ, ఆహార శుద్ధి, ఔషధ రంగాల్లో పరస్పర సహకారాన్ని, పెట్టుబడులను పెంపొందించుకోనున్నట్లు తెలిపారు.

# రేపు భూమి మీదకు సునీతా విలియమ్స్

(మొదటిపేజీ తరువాయి)

- ప్రకటించింది. వీరి క్రూ డ్రాగన్ వ్యోమనౌక.. ఫ్లోరిడా తీరానికి చేరువలో సాగర జలాల్లో దిగుతుందని వివరించింది.
- భారత కాలమానం ప్రకారం సునీత తిరుగు పయనం ఇలా..
- క్రూ డ్రాగన్ వ్యోమనౌక హ్యాచ్ మూసివేత: మంగళవారంఉదయం 8.15కు మొదలవుతుంది.
- అంతరిక్ష కేంద్రం నుంచి విడిపోవడం: ఉదయం 10.15 గంటలకు ప్రారంభం.
- భూవాతావరణంలోకి పునఃప్రవేశం కోసం ఇంజిన్ల ప్రజ్వలన: బుధవారం తెల్లవారుజామున 2.41 గంటలకు.
- సాగర జలాల్లో ల్యాండింగ్: తెల్లవారుజామున 3.27 గంటలకు.
- సహాయ బృందాలు రంగంలోకి దిగి.. క్రూ డ్రాగన్‌ను వెలికితీస్తాయి.
- ఈ కార్యక్రమాన్ని నాసా ప్రత్యక్ష ప్రసారం చేస్తుంది. భారత కాలమానం ప్రకారం మంగళవారం ఉదయం 8:15 గంటల నుంచి ఇది ప్రారంభమవుతుంది.
- ల్యాండింగ్ తర్వాత వ్యోమగాములను హ్యూస్టన్‌లోని జాన్సన్ స్పేస్ సెంటర్‌కు తరలిస్తారు. అక్కడ వారికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. దీర్ఘకాల అంతరిక్షయాత్ర తర్వాత వారి శారీరక స్థితిని పరిశీలిస్తారు. భూ గురుత్వాకర్షణ శక్తికి తిరిగి సర్దుబాటు అయ్యేలా నిపుణులు వారికి తోడ్పాటు అందిస్తారు.

## క్రైమ్ డీసీపీగా బాధ్యతలు చేపట్టిన జనార్దన్

మార్చి 17, ( సమయం న్యూస్) : వరంగల్ పోలీస్ కమిషనరేట్ క్రైమ్ డీసీపీగా జనార్ధన్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. 1989 ఎస్ఐ బ్యాచ్‌కు చెందిన జనార్ధన్ వరంగల్, ఖమ్మం, సీఐడీ విభాగాల్లో వివిధ హోదాల్లో పని చేశారు. తెలంగాణ నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్‌లో అదనపు ఎస్పీగా పని చేస్తున్న జనార్దన్‌కు డీసీపీగా పదోన్నతి కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆయన వరంగల్



పోలీస్ కమిషనరేట్ క్రైమ్స్ డీసీపీగా నియామకమయ్యారు.



## సీపీ ని మర్యాదపూర్వకంగా కలసిన నూతన క్రైమ్స్ డీసీపీ

మార్చి 17,( సమయం న్యూస్) : వరంగల్ పోలీస్ కమిషనరేట్ నూతన క్రైమ్ డిసిపీగా బాధ్యతలు చేపట్టిన బి జనార్ధన్ సోమవారం నాడు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ను మర్యాదపూర్వకంగా కలుసుకొని మొక్కను అందజేశారు

## ఇంటర్ పరీక్షలు.. 831 ఆబ్సెంట్.... ఒక విద్యార్థి పై మాల్ ప్రాక్టీస్ కేసు

**మార్చి 17,( సమయం న్యూస్):** ఇంటర్మీడియట్ పరీక్షలు సోమవారం మొదటి సంవత్సరం ఎకనామిక్స్, ఫిజిక్స్ పరీక్ష ప్రశాంతంగా జరిగిందని జిల్లా ఇంటర్ విద్య అధికారి శ్రీ తిరుమలపుడి రవికుమార్ తెలియజేశారు. మొత్తం 831 మంది విద్యార్థులు ఆబ్సెంట్ అయ్యారని తెలిపారు. కాగా సోమవారం డిచ్పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చీటీలు రాస్తూ కాపీయింగ్ చేస్తున్న ఒక విద్యార్థి పై మాల్ ప్రాక్టీసు కేసు నమోదు చేశామని జిల్లా ఇంటర్ విద్య అధికారి శ్రీ రవికుమార్ తెలిపారు.జిల్లాలో మొత్తం 20,110 మంది విద్యార్థులకు గాను 19,279 విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని తెలియజేశారు. మొత్తం 95.9 శాతం విద్యార్థులు పరీక్షలు రాయగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్షలు నిర్వహించామని తెలియజేశారు. డిచ్పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చీటీలు రాస్తున్న ఓ విద్యార్థి ని చీఫ్ సూపరింటెండెంట్ పట్టుకుని మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు చేశారని జిల్లా ఇంటర్ విద్య అధికారి తెలిపారు. జిల్లాలో మొత్తం 57 పరీక్ష కేంద్రాలకు గాను 54 పరీక్ష కేంద్రాలను తనిఖీలు చేశారు. జిల్లా ఇంటర్ విద్య అధికారి శ్రీ రవికుమార్ తో పాటు జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు చిన్నయ్య, రజియుద్దిన్ అస్లాం, శ్రీమతి కనకమహా లక్ష్మి, ముగ్గురు ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ లు, హై పవర్ శ్రీనాథ్ కమిటీ, బల్క్ అధికారి బుద్ధిరాజ్ లు, కస్టోడియన్లు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసి పర్యవేక్షణ చేసారు. జిల్లా ఇంటర్ విద్యా అధికారి శ్రీ తిరుమలపూడి రవికుమార్ బోధన పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, మధుమలాంఛ ప్రభుత్వ జూనియర్ కళాశాల, విజయ్ సాయి జూనియర్ కళాశాల, షిరిడీ సాయి జూనియర్ కళాశాల, వర్ని ప్రభుత్వ జూనియర్ కళాశాల, కోటగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలలను తనిఖీ చేసి సమీక్షించారు. హై పవర్ కమిటీ శ్రీనాథ్ ఆధ్వర్యంలో 5 జూనియర్ కళాశాలలు, పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు శ్రీ చిన్నయ్య, శ్రీ రజీయుదిన్ అస్లాం, శ్రీమతి కనకమహాలక్ష్మి 18 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు శ్రీ నర్సయ్య, శ్రీ బాలాజీ, శ్రీమతి యమున బృందం 15 పరీక్ష కేంద్రాలను, సిటింగ్ స్కాడ్ బృందాలు 8 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. బల్క్ అధికారి శ్రీ బుద్ధి రాజ్ ఐదు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసి సమీక్షించారు.



## ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ IPS కు ఎడిటర్స్ సంఘం సన్మానం

**ఆదిలాబాద్ మార్చి 17( సమయం న్యూస్) :** ఇటివలే తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం ఆదిలాబాద్ జిల్లా కు నూతన ఎస్పీగా అఖిల్ మహాజన్ నియమించిన విషయం తెలిసిందే.. సోమవారం ఆదిలాబాద్ జిల్లా పోలీసు కార్యాలయం (DPO) లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పత్రిక ఎడిటర్స్, ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి మడప సంతోష్, మహమ్మద్ ఫిరోజ్ ఖాన్ లు ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ IPS ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువతో అభినందనలు తెలియజేశారు. సంఘం నాయకులు నరేష్ కుమార్, సతీష్, రత్నాకర్ తదితరులు ఉన్నారు.

## దృష్టి లోపం ఉన్న విద్యార్థులకు ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ

**: జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ.**

**జయచంకర్ భూపాల్ పల్లి, మార్చి 17,(సమయం న్యూస్) :** సోమవారం, ఐడీఓసీ కార్యాలయంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో దృష్టి లోపంతో బాధపడుతున్న విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల కంటి పరిరక్షణకు అన్ని ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలలోని విద్యార్థులకు, అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు గత నెలలో కంటి పరీక్షలు నిర్వహించామని తెలిపారు. కంటి చూపు సమస్యలున్నట్లు గుర్తించిన విద్యార్థులకు తిరిగి ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి భూపాలపల్లిలో కంటి పరీక్షలు నిర్వహించి దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. ఈ పరీక్షల ద్వారా దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించిన 658 మంది విద్యార్థుల్లో 292 మందికి మొదటి విడతగా ఉచిత కంటి అద్దాలు పంపిణీ చేశామని, మిగిలిన విద్యార్థులకు త్వరలో కంటి అద్దాలు పంపిణీ చేస్తామని ఆయన తెలిపారు. కంటి పరీక్షల నిర్వ హణ కోసం చిట్యాల, మహాదేవ్‌పూర్ మండలాలను యూనిట్‌గా తీసుకుని 4 ప్రత్యేక టీములను ఏర్పాటు చేశా మన్నారు. ఈ టీముల్లో ఇద్దరు వైద్యులు, ఇద్దరు ఫార్మసిస్టులు, ఒక ఏఎన్ఎం, ఆప్తమాలజిస్టులు పర్యవేక్షణలో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించామని అన్నారు. విద్యార్థుల దృష్టి సమస్యలను తొందరగా గుర్తించడం ద్వారా, వారి విద్యాభ్యాసంపై



దుష్ప్రభావం పడకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా మధుసూదన్, ఆర్బిఎస్కే కోఆర్డినేటర్ డా శ్రీనివాస్, పిఓ ప్రమోద్, ఆర్బిఎస్కే సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## అర్జీల పరిష్కారం సత్వరమే పూర్తి చేయాలి

**: జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**పెద్దపల్లి, మార్చి 17 ( సమయం న్యూస్) :** అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో అదనపు కలెక్టర్ డి.వేణు తో కలిసి ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ఎలిగేడు మండలానికి చెందిన ఎం. అంజమ్మ. సుల్తాన్ పూర్



గ్రామ శివారులో తన తండ్రికి 10 గుంటల వ్యవసాయ భూమి ఉందని, తన తండ్రి మరణించినందున ఆ భూమిని ధరణి లో తన పేరు పై చేర్చి పట్టా పాస్ పుస్తకం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా తహసిల్దార్ ఎలిగేడు కు రాస్తూ విచారణ చేసి అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అంతర్గాం మండలం ఎల్లంపల్లి గ్రామానికి చెందిన ఏ.శంకరవ్వ తమ గ్రామంలో ప్రాజెక్టు కింద ముంపుకు గురైందని, ఆడపిల్లల కూలి వేతనం (ఆర్&ఆర్) ప్యాకేజ్ ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా తహసిల్దార్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు, తది తరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి సమస్యల పరిష్కారంలో జాప్యం చేయరాదు

**: అడిషనల్ కమిషనర్ శివకుమార్ నాయుడు**

*** జీహెచ్ఎంసీ వ్యాప్తంగా ప్రజావాణికి 165 అర్జీలు**

**హైదరాబాద్, మార్చి 17( సమయం న్యూస్):** ప్రజావాణి సందర్భంగా ప్రజల నుండి వచ్చిన విన్నపాల పరిష్కారంలో జాప్యం చేయరాదని జిహెచ్ఎంసి అడిషనల్ కమిషనర్ శివకుమార్ నాయుడు అధికారులకు సూచించారు. సోమవారం జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు శివకుమార్ నాయుడు, వేణుగోపాల్, రఘు ప్రసాద్, చంద్రకాంత్ రెడ్డి అడిషనల్ సిసి గంగాధర్ పాల్గొని నగరం నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుండి విన్నపాలు స్వీకరించి క్షుణ్ణంగా పరిశీలించి అక్కడికక్కడే పరిష్కారం కోసం సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా శివ కుమార్ నాయుడు మాట్లాడుతూ... నగర ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు విశేష కృషి చేయాలన్నారు. వ్యక్తిగత, సామాజిక సమస్యల పై ఎన్ని రోజుల్లో పరిష్కారం



చేస్తారో అర్జీదారునికి లిఖిత పూర్వకంగా సమాధానం పంపించాలని అధికారులను ఆదేశించారు. జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 85 విన్నపాలు రాగా, అందులో టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి 36, ట్యాక్స్ సెక్షన్ 12, ఇంజనీరింగ్ విభాగం 8, అడ్మినిస్ట్రేషన్, శానిటేషన్ విభాగాలకు మూడు చొప్పున, యు.సి.డి, ఎలక్ట్రికల్, అడ్వర్టైజ్ మెంట్, స్పోర్ట్స్ విభాగాలకు రెండు చొప్పున, సి.టి.ఓ, హెల్త్, లేక్స్, ల్యాండ్ అక్విజిషన్, ఎస్టేట్స్, వెటర్నరీ, ఆర్.టి.ఐ సిపిఆర్ఓ, హౌసింగ్ విభాగాలకు ఒకటి చొప్పున ఫిర్యాదులు అందగా, ఫోన్ ఇన్ ద్వారా 7 ఫిర్యాదులు అందాయి. జిహెచ్ఎంసి పరిధిలోని ఆరు జోన్లలో మొత్తం 80 అర్జీలు వచ్చాయి. అందులో కూకట్ పల్లి జోన్ లో 31, సికింద్రాబాద్ జోన్ లో 20, శేరిలింగంపల్లి జోన్ లో 20, ఎల్బీనగర్ జోన్ లో 4, చార్మినార్ జోన్ లో 3, ఖైరతాబాద్ జోన్ లో 2 అర్జీలు అందాయి. ప్రజావాణి కార్యక్రమంలో అడిషనల్ సిసీపీ ,ప్రదీప్, వాటర్ వర్క్స్ జిఎం సాయి రమణ, డిప్యూటీ సి ఈ పనస రెడ్డిహౌసింగ్, ఈ ఈ రాజేశ్వర్ రావు, పి వి రమణ రావు ఎస్ యన్ డి పి iఈ ఈ వెంకటేశ్వర రావు ఏ ఈ ఈ బాలాజీ చీఫ్ వెటర్నరీ అధికారి డాక్టర్ అబ్దుల్ వకీల్, వాల్యుయేషన్ అధికారి మహేష్ కులకర్ణి, యు బి డీ డైరెక్టర్ వెంకటేశ్వర్ రావు,ఓఎస్ డి అనురాధ, ఏ ఎం సీ లు ఇతర శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తో మెరుగైన విద్య

**జిల్లా కలెక్టర్ రాజర్షి షా**

**ఆదిలాబాద్ మార్చి 17, ( సమయం న్యూస్) :** ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ప్రోగ్రాం ను సోమవారం జైనథ్ మండలం పిప్పర్ వాడ ప్రభుత్వ ప్రైమరీ స్కూల్ లో ప్రారంభించిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా. అనంతరం పదవ తరగతి విద్యార్థులకు హాల్ టికెట్స్ అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా పాలనాధికారి మాట్లాడుతూ జిల్లాలో 8 స్కూల్స్ ను ఎంపిక చేయడం జరిగిందని, దేవాపూర్ 2 ఉర్దూ, తెలుగు మీడియం ప్రైమరి స్కూల్, తాటిగూడ, కోడద్, బాలాపూర్, రణదీవ్ నగర్ , పిప్పర్ వాడ, అడ లలో ప్రారంభించడం జరిగిందనీ ఆన్నారు .ప్రైమరీ స్కూల్ హై స్కూల్ లలో కంప్యూటర్ సిస్టమ్స్ ల్యాబ్ తప్పని సరిగా ఉండాలని, మైక్ హెడ్సెట్ ఇవ్వడం జరిగిందని, నలుగురు ఉపాధ్యాయులు హైదరాబాద్ లో శిక్షణా తీసుకున్న వారు ఉపాధ్యాయులకు అవగాహన కల్పిస్తున్నారని, విద్యాశాఖ ,



ఏషియా ఫౌండేషన్ వారి కోఆర్డినేషన్ తో ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టడం జరిగిందనీ, మూడవ తరగతి నుంచి ఐదవ తరగతి వరకు ఎవరైతే పిల్లలు వెనుకబడి ఉంటారో వారిని గుర్తించి వెనుకబడిన వారిని ఏ బి సి కేటగిరీలు గా విభజించి బి, సి కేటగిరి వారిని వారిలో పది మందిని పిల్లలను తీసుకొని వీరికి మాత్రమే AI ద్వారా బోధన చేయడం జరుగుతుందని అన్నారు. ఈ పాఠశాలలో 16 మంది విద్యార్థులను గుర్తించడం జరిగిందనీ అన్నారు. ప్రతిరోజు పిల్లలకి 20 నిమిషాల సెషన్ ఉంటుందని వారానికి నాలుగు సెషన్ లలో పిల్లలకి మౌస్, లాగిన్ ఎలా చేయడం టీచర్స్ దగ్గరుండి నేర్పించాలని, 3 నుండి 5 వ తరగతి లో నేర్చుకుంటే పదవ తరగతి లో మంచి రిజల్ట్ వస్తుందని, పెప్పర్ వాడ స్కూల్ కూడా టాప్ లో ఉండాలని కోరారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పిప్పరవాడలో



ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న. హెల్త్ కార్నర్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులు న్యూట్రిషన్ డే లో భాగంగా వివిధ రకాల కూరగాయలు పండ్లు పాలు గుడ్లలో లభించే. పోషకాలు విటమిన్లను వివరించిన తీరును ఆసక్తిగా గమనించి ప్రధానోపాధ్యాయులు శశికళ ను, ఉపాధ్యాయులు అనిత ను విద్యార్థులను అభినందించారు.

## సంపాదకీయం

# వెన్నాడుతున్న ఉక్రెయిన్ యుద్ధం నీడలు !

ఇప్పటికే అంతా సద్దుమణిగిందనుకుంటున్న తరుణంలో ఉక్రెయిన్ యుద్ధం ప్రంచ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసింది. పుతిన్ తగ్గినట్లు తగ్గి..యుద్ధం ముగిస్తున్నామని ప్రకటించినా,యుద్ధజ్వాలలు ఆగడం లేదు. వరుసగా ఉక్రెయిన్‌పై తాజా డ్రోన్ దాడులు పుతిన్ యుద్ధకాంక్షను తెలియచేస్తున్నాయి. యుద్ధ నివారణకు ట్రంప్ మధ్యవర్తిత్వం పనిచేయడం లేదని గుర్తించాలి. ఉక్రెయిన్ యుద్ధం ప్రపంచ దేశాలను తలాకుతలం చేస్తోంది. పుతిన్ హెచ్చరికలు ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రపంచ దేశాధినేతలంతా ముందు రష్యాతో చర్చించి యుద్ధాన్ని అంతమొందించే చర్యలకు దిగకుండా రెచ్చగొట్టే చర్యలకు దిగుతూ రావడంతో ఇది రావణకాష్టంలా తయారయ్యింది. దీంతో ఉక్రెయిన్‌ను మరింతగా రెచ్చగొట్టే ప్రయత్నాలు సాగుతున్నాయి. ఈ క్రమంలో ప్రపంచ దేశాలపై వంటనూనెలు, పెట్రో ధరలపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఈ క్రమంలో ట్రంప్ పగ్గాలు చేపట్టిన తరవాత ముందుగా ఉక్రెయిన్ యుద్ధాన్ని నిరోధించడానికి పూనుకున్నారు. రష్యా ను కూడా ఒప్పించారు. అయితే దాడులు కొనసాగడం ఆందోళనకరంగా తయారయ్యింది. ప్రధానంగా ఇప్పటికే ఉక్రెయిన్ భారీగా నష్టపోయింది. అలాగే రష్యాకూడా నష్టపోయింది.ఉక్రెయిన్ యుద్ధం కారణంగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థలు అతలాకుతలం అయ్యాయి. అందువల్ల ప్రపంచ దేశాల నేతలు ఇప్పుడు మరింత బాధ్యతగా వ్యవహరించాలి. ప్రపంచ సంక్షోభాన్ని నివారించగలగాలి. అందుకు ఇగోలు పక్కన పెట్టి ముందుకు రావాలి. ఉక్రెయిన్ యుద్ధాన్ని నివారించాలి. అమెరికా తదితర దేశాలు ఇంకా ఉక్రెయిన్‌ను రెచ్చగొట్టే యత్నాలను ఆపాలి. అప్పుడే ప్రపంచ దేశాలకు శాంతి కలుగుతుంది. మూడో ప్రపంచ దేశాలు మరింత దెబ్బతినకుండా చూడాలి. ఉక్రెయిన్ యుద్ధసంక్షోభ ఫలితంగా ఇంధన ధరలు పెరిగిన ప్రభావం ఎరువుల ఉత్పత్తిపై కనిపిస్తుందని పరిశోధకుల అంచనా. ఇలాగే యుద్ధం కొనసాగితే ఆహార సంక్షోభం కూడడా పెరుగుతుంది. దీనిని నివారించకుంటే తీవ్ర పరిణమాలు ఉంటాయన్న హెచ్చరికలు వస్తున్నాయి. ఉక్రెయిన్ యుద్ధ ఫలితంగా ఇప్పటికే అంతర్జాతీయ మార్కెట్లో క్రూడాయిల్, వంటచమురు ధరలకు రెక్కలు వచ్చాయి. త్వరలో ఈ ప్రభావం ప్రపంచ ఆహార వ్యవస్థపై పడుతుందని ఆందోళనలున్నాయి. తాజాగా ఈ ప్రభావం ఎరువుల ఉత్పత్తిపై పడుతుందని, దీంతో ఒక్కమారుగా వీటి ధరలు పెరిగి పంట ఉత్పత్తి భారీగా క్షీణిస్తుందని అంచనా వేస్తున్నారు. ఎరువుల ఉత్పత్తి తగ్గడం తత్ఫలితంగా ఆహార పదార్థాల ఉత్పత్తి తగ్గడం కలిసి అంతిమంగా ప్రపంచ ఆహార భద్రతను ప్రమాదంలోకి నెడతాయని ప్రపంచం ఆందోళన చెందుతోంది. ఆయాదేశాల ప్రభుత్వాలు తక్షణం తగిన చర్యలు తీసుకోకపోతే చాలామంది కరువు రక్కసికి బలికాక తప్పదని నిపుణుల హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా మనదేశంలో ప్రజలను బతికించుకోవాలంటే ప్రభుత్వాలు ముందుగా మేలుకొని ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టడం, దేశీయంగా ఎరువుల ఉత్పత్తిని పెంచడం, పేదరిక రేఖకు దిగువన ఉన్నవారికి తగినంత ఆహార భద్రత కల్పించడం, సరిపడా ఆహారధాన్యాలను సమీకరించి నిల్వ చేసుకోవడం తదితర చర్యలు చేపట్టాలని సూచించారు. ఇంధన ధరల పెరుగుదల అమ్మోనియా ఉత్పత్తిపై ప్రభావం చూపనుంది. అలాగని ఎరువులు తక్కువగా వాడితే దాని ప్రభావం దిగుబడి, నాణ్యతపై పడుతుంది. ఇంధన ధరల పెరుగుదల ప్రభావంతో ఎరువుల రేట్లు విపరీతంగా పెరిగి ఉంటాయి. దీనివల్ల రైతు తక్కువగా ఎరువులు కొనుగోలు చేయడం జరగవచ్చని, ఇది కమతంలో పంట దిగుబడి తగ్గడానికి దారితీస్తుందని విశ్లేషించారు. ప్రపంచ ఎరువుల ఉత్పత్తికి అవసరమైన ముడి పదార్ధాల సరఫరా అత్యధికంగా రష్యా, ఉక్రెయిన్ నుంచి జరుగుతుంది. యూరప్‌లో అతిపెద్ద ఎరువుల ఉత్పత్తిదారైన యారా కంపెనీ అవసర ముడిపదార్థాలను ఉక్రెయిన్ నుంచి కొంటుంది. సంక్షోభం కారణంగా ఉక్రెయిన్ పతనమవడం, రష్యాపై ఆంక్షలు విధించడం ముడిపదార్ధాల సరఫరాపై ప్రభావం చూపనున్నాయి. బెలారస్, రష్యాలు ప్రపంచ పొటాషియం ఉత్పత్తిలో మూడోవంతును ఉత్పత్తి చేస్తున్నాయి. ఎరువుల తయారీలో పొటాషియం కూడా కీలకపాత్ర పోషిస్తుంది. మొత్తంగా ట్రంపం ఇప్పుడుఉన్న పరిస్థితులను దారికి తెచ్చే ప్రయత్నాలు తీవ్రంచేయాల్సి ఉంది. రషాఉక్రెయిన్ యుద్ధం అగితే తప్ప సాధారణ స్థితికి వచ్చేలా లేదు. ప్రపంచల ఏదాలపై తీవ్ర ప్రబావం చూపుతున్న ఈపరిణమాలను ప్రతి ఒక్కరూ అవగాహన చేసుకోవాలి. ప్రధానంగా భారత ఆర్థిక వ్యవస్థ అతలాకుతలం అవుతోంది. ద్రవ్యోల్బణం కట్టడి కావడం లేదు. ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. దేశీయంగా వంటనూనెలకు ప్రోత్సాహం దక్కడం లేదు. దేశీయంగా ఆహారధాన్యాల స్వయం సమృద్ధి సాధించినా దిగుబడులపై ఆధారపడడంతో మనదేశం భారీ మూల్యం చెల్లించుకుంటోంది. ఈ దశలో మన పాలకులు గట్టి నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది. దేశీయంగా పంటలకు ప్రోత్సాహకాలు పెంచాలి. పంటించిన పంటలను గిట్టుబాటు ధరలు ఇచ్చి కొనుగోలు చేయాలి. వీటిని ప్రజలకు తక్కువ ధరలకు సరఫరా చేయగలగాలి. అప్పుడే దేశంలో ఆర్థికవ్యవస్థ బలోపేతం కాగలదు. ప్రజలకు ఆహారపదార్ధాలు అందుబాటులోకి రాలవు. అందుకు కఠిన చర్యలు తీసుకుని ముందుకు సాగితే మన ఆర్థిక వ్యవస్థ నిలదొక్కుకోగలదు.

# కలెక్టర్ కు కృతజ్ఞతలు తెలిపిన పాలిటెక్నిక్ విద్యార్థినిలు

సంగారెడ్డి మార్చి17, (సమయం న్యూస్) : కళాశాల అభివృద్ధికి సిఎస్ఆర్ నిధులు కేటాయించడం పట్ల హర్షం. సంగారెడ్డి పాలిటెక్నిక్ కళాశాలలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి సిఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) నిధులు కేటాయించినందుకు విద్యార్థులు సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు ని కలిసి పుష్పగుచ్చం ఇచ్చి కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ను, సంగారెడ్డి గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీమతి .పి. జానకి దేవి, ఆధ్వర్యంలో విద్యార్థులు కలిసి



అభినందనలు తెలిపారు. సిఎస్ఆర్ నిధులతో కళాశాలలో సిసి రోడ్డు నిర్మాణం, తాగునీటి సౌకర్యానికి ఆర్వో ప్లాంట్ నిర్వహణ, అభివృద్ధికి నిధులు ఇచ్చినందుకు విద్యార్థులు ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కళాశాల లో మౌలిక వసతులు ఏర్పాటు తో మెరుగైన విద్యా వాతావరణాన్ని అందిస్తాయని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు ప్రయోజనకరమైన ప్రతి అంశాన్ని ప్రాధాన్యతగా తీసుకుని చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. హెచ్ ఓ డి, ఈఈ, ఈ సెక్షన్ వి. ఇందిరా ప్రియదర్శిని. జనరల్ సెక్షన్ హెచ్ ఓ డి .ఎస్ ఎన్ పద్మావతి .ఈసీ సెక్షన్ ఇంచార్జ్ హెచ్ ఓ డి. విద్యాసాగర్, డిపార్ట్మెంట్ మరియు. హాస్టల్ ఇన్చార్జ్. B.శ్రీనివాస్ గౌడ్.M. జగదీశ్వర్, విద్యార్థినిలు పాల్గొన్నారు.

## తల్లిదండ్రులు సేంద్రియ కూరగాయలు

# కొనుగోలు చేసేలా అవగాహన కల్పించాలి

* **ఆర్గానిక్ పంట ఉత్పత్తులను ప్రోత్సహించాలి..**
* **కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి..**

కరీంనగర్ మార్చి17( సమయం న్యూస్) : కరీంనగర్లో విద్యార్థులు ఏర్పాటు చేసిన మోడల్ కూరగాయల సంత ప్రారంభం.. బిజినెస్ స్కిల్స్ మార్కెటింగ్ సరళిపై విద్యార్థులకు. సేంద్రియ కూరగాయల వల్ల లాభాలపై ప్రజలకు అవగాహన విద్యార్థులు విద్యారంగంలో చక్కగా రాణిస్తూనే వ్యాపార రంగంలోనూ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పిలుపునిచ్చారు. మనం తినే ఆహారాన్ని అందిస్తున్న రైతుల కష్టనష్టాలను స్వయంగా తెలుసుకోవాలని సూచించారు. వారు ఎంతో కష్టపడితే మనకు పంట ఉత్పత్తులు అందుబాటులోకి వస్తున్నాయని పేర్కొన్నారు. సోమవారం కరీంనగర్లోని కాశ్మీర్ గడ్డ రైతు బజార్లో ప్రభుత్వ పాఠశాలల్లో పండించిన కూరగాయలతో విద్యార్థిని విద్యార్థులు ఏర్పాటుచేసిన మోడల్ వెజిటేబుల్ మార్కెట్ ను జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కూరగాయల సంత జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జన్య ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ కూరగాయల స్టాళ్లను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. కూరగాయల విక్రయాలపై అనుసరించాల్సిన వ్యూహాలను వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ బిజినెస్ స్కిల్స్ ఉపయోగించి మార్కెట్లో అమ్మకాలు సాగిస్తే అద్భుతమైన ఫలితాలు సాధించవచ్చు అని పేర్కొన్నారు. దీంతోపాటు సేంద్రీయ పద్ధతుల వల్ల పండించిన కూరగాయల లాభాలను కూడా వినియోగదారులకు వివరించాలని సూచించారు. సేంద్రియ పద్ధతుల్లో పండించిన పంట ఉత్పత్తులు, కూరగాయలను ఎక్కువగా వాడుకునేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. అదేవిధంగా ఆర్గానిక్ పంట ఉత్పత్తులను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని కలెక్టర్ పేర్కొన్నారు. విద్యార్థులు మంచి కాన్సెప్ట్ తో వ్యాపార రంగంలో ప్రతిభ కనపరుస్తున్నారని ఇది నవ శకానికి నాంది పలుకుతుందని, అన్ని రంగాల్లో విద్యార్థులు ప్రతిభను చూపాలని తమకు ఎవరు సాటి రారని నిరూపించాలని సూచించారు. విద్యార్థులు చదువుతోపాటు వ్యాపార రంగంలోనూ మెలకువలను నైపుణ్యాలను పెంపొందించుకుంటూ ముందుకెళ్తే జీవితంలో అత్యుత్తమంగా స్థిరపడతారని తెలిపారు. రాబోయే రోజుల్లో విద్యార్థులకు మరిన్ని కొత్త కొత్త కాన్సెప్ట్ లతో వినూత్నమైన కార్యక్రమాలను చేపడతామని వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సేంద్రియ పద్ధతుల వల్ల పండించిన కూరగాయలు ఆరోగ్యానికి ఎంతో లాభదాయకమని, ప్రజలు తల్లిదండ్రులకు వీటి గురించి విస్తృతంగా అవగాహన కల్పించాలని విద్యార్థులను కలెక్టర్ కోరారు. జిల్లా కలెక్టర్ స్వయంగా తన డబ్బులతో కూరగాయలను విద్యార్థుల నుంచి కొనుగోలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి జనార్ధన్ రావు, జిల్లా సైన్స్ అధికారి జైపాల్ రెడ్డి, కోఆర్డినేటర్స్ అశోక్ రెడ్డి, శ్రీనివాస్, జన్య ఫౌండేషన్ ఆపరేషన్ మేనేజర్ సురేందర్, విద్యాశాఖ అధికారులు, సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

* **కొత్త కాన్సెప్ట్ కు జిల్లా కలెక్టర్ శ్రీకారం..**

**ఆకట్టుకున్న మోడల్ విజిటేబుల్ మార్కెట్..**

కరీంనగర్లో కాశ్మీర్ గడ్డ రైతు బజార్ అంటే తెలియని వారు ఉండరు. చాలా ఫేమస్ మార్కెట్. ప్రజలు వినియోగదారుల రద్దీ కూడా విపరీతంగానే ఉంటుంది.. కరీంనగర్ నలు మూలల నుంచి ప్రజలంతా ఇక్కడికే వచ్చి కూరగాయలు, వివిధ సామాగ్రిని ఇక్కడే కొనుగోలు చేస్తుంటారు. ఇంతటి ప్రాధాన్యం కలిగిన రైతు



బజార్ సోమవారం ఒక అరుదైన కార్యక్రమానికి వేదికగా నిలిచింది.. అదేంటంటే. సోమవారం ఉదయం ఇక్కడ ఒక వినూత్నమైన కొత్త కాన్సెప్ట్ తో కూరగాయల సంతను ఏర్పాటు చేశారు. ఈ కూరగాయల సంతను ఏర్పాటు చేసింది రైతులో గ్రామీణ ప్రాంత ప్రజలో కాదు.. మరి ఇంకెవరు ఏర్పాటు చేశారు.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న గ్రామీణ ప్రాంత విద్యార్థిని, విద్యార్థులు. మరి వీరెందుకు కూరగాయల ఏర్పాటు చేయాల్సిన అవసరం వచ్చింది అంటే. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి కొత్త కాన్సెప్ట్ తో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. జిల్లాలో ఎంపిక చేసిన 12 ప్రభుత్వ పాఠశాలల నుంచి 60 మంది విద్యార్థిని విద్యార్థులతో కరీంనగర్ లోని కాశ్మీర్ గడ్డ రైతు బజార్లో మోడల్ విజిటేబుల్ మార్కెట్ (కూరగాయల సంత) ను ఏర్పాటు చేయించారు. ఈ మార్కెట్ ను జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జరిగిన ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటు చేశారు. జిల్లాలోని కరీంనగర్ ధన్గర్ వాడి, ఆసిఫ్ నగర్, బూరుగుపల్లి, మానకొండూరు, నుస్తులాపూర్, కన్నాపూర్, నాగుల మల్యాల నగునూర్, జంగపల్లి, చెల్పూర్ కొత్తపల్లి, హుజురాబాద్ బాలుర బాలికల ప్రభుత్వ పాఠశాలల నుంచి దాదాపు 60 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులకు బిజినెస్ స్కిల్స్, మార్కెటింగ్ సరళి, కూరగాయల విక్రయం, కొనుగోలు, మెలకువలు, మార్కెట్ ను అంచనా వేయడం, వినియోగదారులను ఆకట్టుకునేలా వ్యవహరించడం, రైతులు పడుతున్న కష్టనష్టాలను తెలుసుకునేందుకు కలెక్టర్ వినూత్నంగా ఈ కార్యక్రమాన్ని ఎంచుకున్నారు. కూరగాయల సంతను జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కూరగాయలు విక్రయిస్తున్న విద్యార్థిని విద్యార్థులతో చాలాసేపు ముచ్చటించారు. కూరగాయల రేట్లు, డిస్కౌంట్ ఇస్తున్న వైనం, నగదుకు సంబంధించిన లెక్కలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల్లో బిజినెస్ స్కిల్స్ పెంపొందించేలా ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. వ్యాపార రంగంలో నైపుణ్య అభివృద్ధి పెంపొందించుకుంటున్నారని కితాబు ఇచ్చారు. విద్యార్థులు సంతృప్తికరంగా జవాబులు ఇవ్వడంతో కలెక్టర్ వారిని ప్రత్యేకంగా ప్రశంసించారు. కూరగాయల విక్రయం పై వినియోగదారులను ఆకట్టుకునే రీతిలో ఏమేం చర్యలు తీసుకోవాలో స్వయంగా కలెక్టర్ అవగాహన కల్పించారు. ప్రతి స్టాల్ ను సందర్శించి కూరగాయల రేట్లు వివిధ అంశాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి స్వయంగా తన డబ్బులతో కూరగాయలను విద్యార్థుల నుంచి కొనుగోలు చేశారు. అదేవిధంగా డి ఈ ఓ జనార్దన్ రావు, విద్యాశాఖ అధికారులు కూడా కూరగాయలను పర్చేజ్ చేశారు. అక్కడికి వచ్చిన కలెక్టరు అధికారులు ప్రజలను కట్టుకున్న రీతిలో విద్యార్థులు కూరగాయల అమ్మకాలు సాగించారు. సేంద్రియ పద్ధతులతో పాఠశాలల్లో పండించిన కూరగాయలపై ప్రజలందరికీ అవగాహన కల్పించాలని విద్యార్థులకు కలెక్టర్ సూచించారు ఎలాంటి రసాయన ఎరువులు వాడకుండా పండించామనే అంశాన్ని విస్తృతంగా ప్రచారం కల్పించాలని పేర్కొన్నారు. ఈ విధంగా పండించిన కూరగాయలు ఆరోగ్యానికి కూడా చాలా మంచివని ప్రజలకు సూచించాలని జిల్లా కలెక్టర్ కోరారు. ఒకవైపు విద్యార్థులకు బిజినెస్ స్కిల్స్, మార్కెటింగ్ సరళి, మరోవైపు ప్రజల సంపూర్ణ ఆరోగ్యానికి దోహదపడే సేంద్రీయ పద్ధతిలో పండించిన కూరగాయల విక్రయంపై విద్యార్థులతో మార్కెట్ ఏర్పాటు చేయించడం జిల్లాలోనే రికార్డు..



# విధుల నిర్వహణలో ఉద్యోగులకు ఆటంకం కలిగిస్తే సహించేది లేదు

* **జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.**

నిర్మల్ మార్చి17 (సమయం న్యూస్) : ప్రభుత్వ ఉద్యోగుల విధుల నిర్వహణలో ఆటంకాలు కలిగిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సోమవారం రాత్రికి ఒక ప్రకటనలో తెలిపారు. తానూరు మండలం బోరిగామ గ్రామంలో రెవెన్యూ ఉద్యోగిపై దాడి ఘటన తమ దృష్టికి వచ్చిందని, ఘటనకు సంబంధించి సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఇప్పటికే పోలీసు అధికారులను ఆదేశించినట్లు కలెక్టర్ తెలిపారు.



www.epapersamayam.com APTEL/2006/18267
సమయం


# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఘన స్వాగతం

*** జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు.**

*** ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

**పటాన్ చెరువు మార్చి17 (సమయం న్యూస్) :** ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డికి స్వాగతం పలికిన కలెక్టర్ క్రాంతి వల్లూరు, ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి. పఠాన్ చెరువు నియోజకవర్గం శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి సోదరుని కుమారుడు వివాహ రిసెప్షన్ కు హాజరైన ముఖ్యమంత్రి. పటాన్ చెరువులోని జిఎంఆర్ ఫం క్షన్ హాల్లో జరిగిన పటాన్చెరువు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సోదరుని కుమారుని వివాహ రిసెప్షన్కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరయ్యారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు తదితరులు,ముఖ్యమంత్రి కి ఘన స్వాగతం పలికారు. నూతన వధూవరులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశీర్వదించారు.









## నీటి సరఫరా లో అవాంతరాలు వద్దు

*** నగర మేయర్ శ్రీమతి గుండు సుధారాణి**

*** కమిషనర్ తో కలిసి ఫిల్టర్ బెడ్ ఈ ఎస్ ఎల్ ఆర్ లపరిశీలన....**

*** నీటి సరఫరా తీరును అడుగుతెలుసుకున్న మేయర్ కమిషనర్...**

**వరంగల్ కార్పొరేషన్, మార్చి17 (సమయం న్యూస్) :** వేసవి కాలం దృష్ట్యా ప్రజలకు నీటి సరఫరా లో అవాంతరాలు లేకుండా చూడాలని నగర మేయర్ శ్రీమతి గుండు సుధారాణి అన్నారు. సోమవారం బల్దియా కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే తో కలిసి మేయర్ నగర పరిధి లోని వడ్డేపల్లి ఫిల్టర్ బెడ్ బాలాజీ నగర్ ఖాజీపేట విష్ణుపురి సోమిడి లో గల ఈ ఎస్ ఎల్ ఆర్ ల ను క్షేత్ర స్థాయి లో పరిశీలించి సమర్థవంతంగా నిర్వహించుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ కమిషనర్ లు వడ్డేపల్లి ఫిల్టర్ బెడ్ ను సందర్శించి నీటి సరఫరా తీరు శుద్దీకరణ విధానం ను అడిగి తెలుసుకొని ఫిల్టర్ బెడ్ నుండి ఎన్ని ప్రాంతాలకు నీరు సరఫరా జరుగుతుంది అని అడిగి తెలుసుకున్నారు. వడ్డేపల్లి జంక్షన్ కు చేరుకొని జంక్షన్ విస్తరణకు తీసుకోవాల్సిన చర్యలు గురించి టౌన్ ప్లానింగ్ అధికారులతో చర్చించి ఎన్ జీ ఓస్ కాలనీ వైపు ప్రజల సౌకర్యార్థం రోడ్ కు అడ్డం గా ఉన్న ఎలక్ట్రికల్ పోల్ ను తొలగించాలని అధికారులను ఆదేశించారు. బాలాజీ నగర్ ఖాజీపేట విష్ణుపూరి లోని ఈ ఎస్ ఎల్ ఆర్ లను సందర్శించి స్థానిక కార్పొరేటర్ ను నీటి సరఫరా తీరు గురించి అడిగి తెలుసుకొని సంతృప్తి వ్యక్తం చేశారు. బల్దియా కాకుండా ఇతర డిపార్ట్మెంట్ వారు అభివృద్ధి పనులు చేపట్టే క్రమం లో బల్దియా నుండి ఎన్ ఓ సి పొందిన తర్వాతే పనులు చేపట్టేలా చూడాలని అధికారులకు సూచించారు. అనంతరం సోమిడి రోడ్డులో వాటర్ సప్లై సరఫరా తీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సిరంగి సునీల్ విజయ శ్రీ రజాలే ఎస్ ఈ ప్రవీణ్ చంద్ర సి ఏం హెచ్ ఓ డా.రాజారెడ్డి హెచ్ ఓ రమేష్ ఈ ఈ లు మహిందర్ మాధవి లత డి ఈ లు సారంగం కార్తీక్ రెడ్డి ఏ ఈ సరిత తదితరులు పాల్గొన్నారు.

## ఆస్తి, నీటి పన్నుల సేకరణలో నిర్దేశిత లక్ష్యాన్ని సాధించండి



*** ఎల్ఆర్ఎస్ పై ప్రజలకు అవగాహన కల్పించండి.**

*** అసౌకర్యం కలగకుండా రంజాన్ ఏర్పాట్లను పటిష్టంగా చేపట్టండి**

*** గ్రేటర్ వరంగల్ నగర మేయర్ శ్రీమతి గుండు సుధారాణి, కమిషనర్ డాక్టర్ అశ్విని**

*** అశ్విని తానాజీ వాఖడ్ తో కలిసి అధికారులతో సమీక్షించిన మేయర్**

**వరంగల్ కార్పొరేషన్ , 17( సమయం న్యూస్) :** ఆస్తి, నల్లా పన్నుల వసూళ్లలో నిర్దేశిత లక్ష్యాన్ని అంకిత భావంతో సాధించాలని గ్రేటర్ వరంగల్ నగర మేయర్ శ్రీమతి గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. సోమవారం మేయర్ జి డబ్ల్యూ ఎం సి కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాఖేడ్ తో కలిసి 2024 25 ఆర్థిక సంవత్సరంలో పన్నుల సేకరణ, ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కరణ పురోగతిని, రంజాన్ పండుగ సందర్భంగా బల్దియా ఆధ్వర్యంలో ఏర్పాట్లపై సమీక్షించి వేగవంతంగా నిర్వహించుటకు అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ కమిషనర్లు పన్నుల సేకరణ పై సర్కిళ్ల వారీగా సమీక్షిస్తూ 2024 25 ఆర్థిక సంవత్సరంలో 118.06 కోట్ల రూపాయల సేకరణ లక్ష్యం కాగా ఇప్పటివరకు 51 శాతంతో 60.17 కోట్ల రూపాయలు సేకరించడం జరిగిందని, నీటి పన్ను లక్ష్యం రూ 30.18 కోట్లు కాగా, కేవలం 79 లక్షల రూపాయలు సేకరించడం జరిగిందన్నారు. పన్నుల వసూళ్లకు కేవలం పక్షం రోజుల సమయం మాత్రమే మిగిలి ఉన్నదని, కనీసం 85 శాతం పన్నుల సేకరణే లక్ష్యంగా అంకిత భావంతో సమష్టిగా కృషి చేయాలన్నారు. కాజీపేట్, కాశిబుగ్గ సర్కిళ్ల పరిధిలో ప్రతి సర్కిల్ నుండి గుర్తించిన వంద మంది బడా బకాయిదారులకు రెడ్ నోటీసులు ఇదివరకు అందజేయడం జరిగిందని, పన్ను చెల్లించని పక్షంలో నిబంధనల మేరకు కఠినంగా వ్యవహరించి ప్రాపర్టీస్ లను సీజ్ చేయాలని ఆదేశించారు. కమర్షియల్,అపార్ట్మెంట్స్, రెసిడెన్షియల్ లలో పెండింగ్ లో ఉన్న నల్లా పన్ను చెల్లించని వారిని వెంటపడి సేకరించాలని ఆదేశించారు. మేయర్ శ్రీమతి గుండు సుధారాణి ఎల్ఆర్ఎస్ పురోగతిపై సమీక్షించగా, జిడబ్ల్యుఎంసి పరిధిలో భూముల క్రమబద్ధీకరణకు లక్ష దరఖాస్తులు రాగా వాటిలో 14, 088 మంది క్రమబద్ధీకరించుకొనుటకు ఫీజులు చెల్లించారని, 680 మందికి క్రమబద్ధీకరణ ధ్రువపత్రాలు అందజేయడం అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగర ప్రజలు ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణ ప్రభుత్వం కల్పించిన సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మేయర్ కోరారు. 26 ఆగస్టు 2020 కు ముందు కచ్చా లేఅవుట్ చేసినవారు వాటిలో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు, ఎల్ ఆర్ ఎస్ కొరకు దరఖాస్తు చేసుకున్న వారు ముందుకు వచ్చి 25% రిబేట్ తో ఈనెల 31 తేదీలోగా ఫీజులు చెల్లించి క్రమబద్ధీకరించుకోవాలని అన్నారు. బల్దియా వ్యాప్తంగా 10 ప్రాంతాల్లో సహాయక కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రతి కేంద్రం నుండి ప్రతిరోజు ఆర్పీలు ఫోన్ల ద్వారా ఎల్ఆర్ఎస్ దరకాస్తుదారులకు ఫీజులు చెల్లించి ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవాలని కోరడం జరుగుతుందన్నారు. దీనికి తోడుగా వివిధ ప్రచార మాధ్యమాలు, హోర్డింగ్ల ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. జిడబ్ల్యూఎంసీ కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాఖేడ్ మాట్లాడుతూ బల్దియా పరిధిలో ఏర్పాటుచేసిన పది హెల్ప్ డెస్క్ ల ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించడంతోపాటు ఎల్ ఆర్ ఎస్ పై వారికి ఉన్న సందేహాలను నివృత్తి చేస్తూ త్వరితంగా ఫీజు చెల్లించి క్రమబద్ధీకరించుకునే విధంగా ప్రోత్సహించాలని సూచించారు. రంజాన్ పండుగ ఏర్పాట్లపై మేయర్ సమీక్షిస్తూ గత సంవత్సరం మాదిరిగా ఈ సంవత్సరం కూడా ముస్లిం సోదరులకు ఇబ్బందులు కలగకుండా బల్దియా ఆధ్వర్యంలో మసీదులకు, ఖబ్రస్తాన్ లకు లైటింగ్ లు, ఈద్గాలో పరిశుభ్రం చేయడం, తదితర ఏర్పాట్లు చేయాలని అధికారులను మేయర్ ఆదేశించారు. వేసవి దృష్ట్యా కుక్కల బెడద నివారణ నిమిత్తం కార్పొరేటర్ల సహకారంతో ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయడంతో పాటు పలు ప్రాంతాల్లో కుక్కల కొరకు నీటి తొట్టీలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ జోన, ఎస్ ఈ ప్రవీణ్ చంద్ర, సీఎం హెచ్ ఓ డాక్టర్ రాజారెడ్డి, ఇన్చార్జిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్లు రవీందర్, ప్రసన్న రాణి, రాజేశ్వర్, టాక్సేషన్ ఆఫీసర్ రామకృష్ణ, ఇంజనీరింగ్ టౌన్ ప్లానింగ్, ఎలక్ట్రికల్, రెవెన్యూ, తదితర విభాగాల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## ఉదయం కూల్చివేత..
## సాయంత్రానికి సీసీ రోడ్డు..

*** బండ్లగూడ జగీర్ మున్సిపాలిటీ లోని కిస్మత్పుర లో రోడ్డు వివాదానికి హైడ్రా శాశ్వత పరిష్కారం**

హైదరాబాద్, మార్చి 17: * బండ్లగూడ జాగీర్ మున్సిపాలిటీ పరిధిలో కిస్మత్ పురాలో రెండు కాలనీలను కలిపే రహదారికి అడ్డంగా నిర్మించిన ప్రహరీని హైడ్రా సోమవారం తొలగించింది.

* అదే రోజు సాయంత్రానికి అక్కడ సిమ్మెంట్ రోడ్డును బండ్లగూడ జాగీర్ మున్సిపాలిటీతో వేయించి రహదారి సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని హైడ్రా చూపింది.

* రంగారెడ్డి జిల్లా, గండిపేట మండలం, బండ్లగూడ జాగీర్లోని ఫార్చ్యూన్ వెస్ట్ మెడోస్ శ్రీ హర్షిత్ లే ఔట్ ల మధ్య ఉన్న ఈ రహదారి కూల్చివేతతో పరిసర కాలనీలకు దారి దొరికింది.

* కిస్మత్పురా గ్రామంలో 18.65 ఎకరాల్లో 173 ప్లాట్లతో ఫార్చ్యూన్ వెస్ట్ మెడోస్ పేరిట కాలనీ ఏర్పడింది. ఈ కాలనీకి ఆనుకుని దాదాపు 12 ఎకరాలలో 160 ప్లాట్లతో శ్రీ హర్షిత్ లే ఔట్ వచ్చింది.

* ఈ రెండు లే ఔట్లను కలుపుతూ 30 అడుగుల వెడల్పుతో రహదారి ఉంది. గతంలో ఇళ్ల నిర్మాణాలు జరగనప్పుడు లే ఔట్ లను కాపాడుకోవాలనే నెపంతో రోడ్డుకు అడ్డంగా ప్రహరీ నిర్మించారు.

* 6 నెలల క్రితం మున్సిపల్ అధికారులు కూల్చేయడంతో రహదారికి ఆటంకాలు తొలగాయి. కానీ మళ్లీ శ్రీ హర్షిత్ లేఔట్ వాళ్లు రోడ్డుకు అడ్డంగా ప్రహరీ నిర్మించడంతో వివాదం తలెత్తింది.

* మున్సిపల్ అధికారులు కూల్చివేతలు చేపట్టినా తిరిగి నిర్మించడంతో 3 ఏళ్లుగా అవస్థలు పడుతున్నామని.. ఫార్చ్యూన్ వెస్ట్ మెడోస్ కాలనీవాళ్లు హైడ్రాకు ఫిర్యాదు చేశారు.

* పూర్తి స్థాయిలో విచారించి సోమవారం ఉదయం మున్సిపల్ అధికారుల సమక్షంలో హైడ్రా ఆ అడ్డుగోడను తొలగించింది.



* రహదారికి అడ్డంగా నిర్మించిన ప్రహరీని తొలగించడమే కాకుండా ఆ వెంటనే బండ్ల గూడ జాగీర్ మున్సిపాలిటీ అధికారులతో మాట్లాడి సాయంత్రానికల్లా సిమ్మెంట్ రోడ్డు వేయించడంతో రెండు కాలనీల మధ్య అడ్డుగోడను శాశ్వతంగా తొలగించినట్టయ్యింది.

* అడ్డుగోడ ఉండడంతో 3 ఏళ్లుగా నరకం చూశామని, 2 కిలోమీటర్లకు పైగా అదనంగా ప్రతి రోజు ప్రయాణించాల్సి వచ్చిందని.. ఇప్పుడు మా కష్టాలకు తెర పడిందని స్థానిక కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేశారు.

* సోమవారం ఉదయం రహదారికి అడ్డంగా ఉన్న ప్రహరీని కూల్చి సమస్యను పరిష్కరించిన హైడ్రాతో పాటు.. సాయంత్రానికి సిమ్మెంట్ రోడ్డు వేసిన బండ్లగూడ జాగిర్ మున్సిపాలిటీకి స్థానికులు అభినందనలు తెలిపారు.

* బండ్లగూడ జాగీర్ కిస్మత్పురా గ్రామాల మధ్య అడ్డుగోడ తొలగడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

# అడుగు జాగాను కూడా వదలని ఆక్రమణలు

*** హైడ్రా ప్రజావాణికి 59 ఫిర్యాదులు**

హైదరాబాద్, మార్చి 17: * ప్రభుత్వ స్థలాలే కాదు.. నాలా, రహదారి అనేది తేడా లేకుండా ఆక్రమణలకు పాల్పడుతున్నారని హైడ్రాకు ఫిర్యాదులు వస్తున్నాయి.

* నాలా, రహదారి వద్ద ఏమాత్రం అవకాశం ఉన్న అడుగు జాగాను కూడా కబ్జాచేసి నిర్మాణాలు చేపడుతున్నారని పలువురు పిర్యాదులు అందజేశారు.

* సంపన్నుల కాలనీలు, సామాన్యులుండే బస్తీలు ఏవీ ఆక్రమణలకు అతీతం కాదని హైడ్రాకు వచ్చిన ఫిర్యాదులు చెబుతున్నాయి.

* సోమవారం హైడ్రా నిర్వహించిన ప్రజావాణికి మొత్తం 59 ఫిర్యాదులు అందాయి.

* ఫిర్యాదులను నేరుగా స్వీకరించడమే కాకుండా.. అక్కడికక్కడే విచారణ చేపట్టి.. సంబంధిత అధికారులకు వాటి పరిష్కార బాధ్యతలను హైడ్ఆ కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్గారు అప్పగించారు.

* ప్రభుత్వ భూమితో పాటు ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాల పరిరక్షణకు అధిక ప్రాధాన్యతను ఇవ్వాలని.. ఎక్కడా కబ్జా కాకుండా చూడాలని హైడ్రా కమిషనర్ అధికారులకు సూచించారు.

* బంజారాహిల్స్ రోడ్డు నంబరు 12లోని శ్రీ వేంకటేశ్వర కోపరేటివ్ హౌసింగ్ సొసైటీలో ఓపెన్ ప్లేస్ ( ప్రజావసరాలకు ఉద్దేశించిన) 600 గజాల స్థలంతో పాటు.. తన ఇంటి స్థలాన్ని కూడా కొంతమేర వెనుక వైపు ఉన్న ప్లాట్ యజమాని కబ్జా చేశారని అన్నపూర్ణ అనే మహిళ హైడ్రాకు ఫిర్యాదు అందజేశారు.

* నాగిరెడ్డి గొలుసు కట్టు చెరువు ఎఫ్టీఎల్ పరిధితోపాటు.. నాలాను, బఫర్ జోన్లో అక్రమ కట్టడాలు వెలుస్తున్నాయని యాప్రాల్ జాయింట్ యాక్షన్ కమిటీ ఫిర్యాదు చేసింది. ఈ చెరువుకు రూ. 1.20 కోట్లు పెట్టి ప్రభుత్వం వేసిన ఫెన్సింగ్ను తొలగించి బఫర్ జోన్లో ప్రహరీ నిర్మిస్తున్నారని..




వెంటనే వాటిని తొలగించాలని కమిటీ హైడ్రాను కోరింది.

* హయత్నగర్ మున్సిపాలిటీ సర్కిల్ 3 లోని వివేకానందనగర్ కాలనీలో 25 అడుగుల రహదారిని ఆక్రమించి ఏకంగా ఇల్లు నిర్మించేశారని.. గతంలో మున్సిపాలిటీ అధికారులు కూల్చేసినా.. మళ్లీ ఇంటిని నిర్మించేశారని ఫిర్యాదు చేశారు.

* కేపీహెచ్బీ లో ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న సర్వీసు రోడ్డును మొత్తం ఆక్రమించి చిరు వ్యాపారాల పేరిట దందాలు చేస్తున్నారని.. అక్కడ తోపుడు బళ్లపై వ్యాపారాలే కాదు.. శాశ్వతంగా డబ్బాలు పెట్టి మొత్తం రోడ్డును ఆక్రమించేశారని.. దీంతో ఆ మార్గంలో వెళ్లలేని పరిస్థితి ఉందని కేపీహెచ్బీ ఫేస్ 1, 2 రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. సర్వీసు రోడ్డులోని దుకాణాలను తొలగిస్తే కాలనీవాళ్లు ఈ దారులను వినియోగించే అవకాశం ఉంటుందని.. చాలా వరకు ప్రధాన రహదారిపై ట్రాఫిక్జామ్లు తొలుగుతాయని పేర్కొన్నారు.

* నార్త్ లాలాగూడలోని స్లమ్లో 940 గజాలు ప్రజావసరాలైన పాఠశాల, కమ్యూనిటీ హాల్కోసం కేటాయించగా.. అందులో 160 గజాల స్థలం తనదంటూ ఓ వ్యక్తి ఇంటిని నిర్మిస్తున్నారని ఫిర్యాదును స్థానికులు అందజేశారు.



# సెల్ ఫోన్లు జేబుల్లో పెట్టుకోవద్దు..

## తొగుట సిఐ షేక్ లతీఫ్

రాయపోల్. మార్చి17. ప్రతి ఒక్కరూ సెల్ఫోన్లను జేబుల్లో పెట్టుకోవద్దని అది గుండెకు అనారోగ్యానికి దారితీస్తుందని తొగుట సీఐ షేక్ లతీఫ్ అన్నారు. సోమవారం దౌల్తాబాద్ మండలం ఇందుప్రియల్ వద్ద రైతులు సాగునీటి కోసం ధర్నా చేస్తుండగా కొద్దిసేపు వారితో ముచ్చటించారు. సెల్ ఫోన్లు వాడుతున్న ప్రతి మనిషి అంగి జేబులో పెట్టుకోకూడదని గుండెకు ప్రమాదకరమని ఇవి తమకు తెలిసినా డాక్టర్లు చెప్పారని గుర్తు చేశారు. సెల్ ఫోన్లు ప్యాంటు జేబులో పెట్టుకోవాలని ఆయన సూచించారు. చిన్నపిల్లలకు ఎట్టి పరిస్థితిలో సెల్ఫోన్లను ఇవ్వకూడదని. వైబ్రేషన్ పెట్టుకోవద్దని సూచించారు. రాత్రి పడుకునే సమయంలో సెల్ ఫోన్లు దూరంగా ఉంచుకోవాలని. సెల్ ఫోన్లను మంచి పనులకు ఉపయోగించుకోవాలని ఆయన ప్రతి ఒక్కరికి సూచించారు..

* **రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్టును తొలగించిన సిఐ..**

రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్టును తొలగించి రాకపోకలకు అసౌకర్యం లేకుండా చర్యలు తీసుకున్నారు. తొగుట సీఐ అటు ప్రజలకు దగ్గరవుతూ ఇటు రైతులకు మంచిగా ఉంటూ సమస్యల పరిష్కారంలో చొరువచూపుతున్నారు. రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్టును తొలగించాల్సింది పోయి ఎవరు కూడా అటువైపు చూడకుండా పట్టిం చుకోకపోవడంతో స్వయంగా సిఐ షేక్ లతీఫ్ అక్కడ ఉన్న రైతులు సహ కారంతో చెట్టును పక్కకు తొలగించి వేశారు.



# బీసీ నాయకత్వాన్ని పెంపొందించుకుందాం

* **బిజెపి జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్**

గజ్వేల్, మార్చి 17 : రాజకీయాలలో బీసీ నాయకత్వాన్ని పెంపొందించు కుందామని బిజెపి జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ అన్నారు. సోమవారం బీజేపీ జగదేవపూర్ మండలాధ్యక్షుడు దాసరి అయిలయ్య యాదవ్ ఆధ్వర్యంలో యాదవ సంఘం నాయకులు బిజెపి జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలను రాజకీయంగా బలోపేతం చేయడానికి బిజెపి పార్టీ ప్రోత్సహిస్తుందన్నారు. బీసీలు ఈ అవకాశాన్ని వినియోగించుకొని రాజకీయంగా ఎదగాలని సూచించారు. బిజెపితో కలసి వస్తే బడుగు బలహీన వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బిజెపి కుకునూర్ పల్లి, ములుగు మండలాల అధ్యక్షులు అనుముల సంపత్ రెడ్డి, శ్రీను, జగదేవపూర్ మండల ప్రధాన కార్యదర్శి మేడ అజిత్ రెడ్డి, బింగి భాస్కర్, మండల కార్యదర్శి బత్తుల. వెంకటేష్, నాయకులు వట్టెల శ్రీకాంత్ , మహిళా మోర్చా, వివిధ గ్రామాల గొల్ల కురుమ కార్యకర్తలు మహిపాల్, బింగి శేఖర్ , అనిల్ , సత్యనారాయణ, మల్లేశం, భాను, వెంకటేష్, యాదగిరి,మల్లేశం, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పదవ తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

* **జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**

భూపాల పల్లి మార్చి 17 ( సమయం న్యూస్): సోమవారం ఐడిఓసి కార్యాలయ సమావేశపు హాలులో ఈ నెల 21వ తేది నుండి వచ్చే నెల 4వ తేదీ వరకు జరుగుతున్న 10వ తరగతి పరీక్షల నిర్వహణపై విద్యా, రెవెన్యూ, పోలీస్, వైద్య, విద్యుత్, పంచాయతి రాజ్, మున్సిపల్, ట్రెజరి, సమాచార, ఆర్టీసీ, రవాణా, పోస్టల్ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 10వ తరగతి పరీక్షలు నిర్వహణకు 21 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 121 పాఠశాలలకు చెందిన 1725 మంది బాలురు,1724 మంది బాలికలు మొత్తం 3449 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. ఉదయం.9:30 నుండి మద్యాహ్నం12:30 వరకు జరుగుతాయని చెప్పారు. విద్యార్దులను ఒక గంట ముందు నుండే పరీక్షా కేంద్రాలకు అనుమతిస్తారని, విద్యార్థులు చివరి నిమిషం వరకు వేచియుండకుండా ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని కలెక్టర్ సూచించారు. పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లును తహాశీల్దార్లు పరిశీలించి ధ్రువీకరణ నివేదికలు అందచేయాలని తెలిపారు. చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్మెంటల్ ఆఫీసర్లు, సిట్టింగ్ స్క్వాడ్లు, ఇన్విజిలేటర్లు విధులు నిర్వహించనున్నారని తెలిపారు చెప్పారు. సెంటర్ కస్టోడియన్లు, రూట్ ఆఫీసర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. 10 వ తరగతి పరీక్షల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పరీక్షలు ప్రారంభం నుండి ముగిసే వరకు విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా సజావుగా జరిగేలా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# దళిత అభివృద్ధి శాఖకు మంత్రిని నియమించాలి

* **సామాజిక సంఘాలు**

**అంబర్ పేట, మార్చి17, సమయం న్యూస్:** ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు సక్రమంగా ఖర్చు చేయాలని, చేవెళ్ల ఎస్సీ ఎస్టీ డిక్లరేషన్ లో భాగంగా అంబేద్కర్ అభయహస్తం కింద 12 లక్షల రూపాయలు ఇవ్వాలని దళి త అభివృద్ధి శాఖకు తక్షణమే మంత్రి ని నియమించాలని అసెంబ్లీలో దళిత వాణి వినిపించాలని కోరుతూ సామాజిక సంఘాల ఆధ్వర్యంలో అంబర్ పేట బిఆర్ఎస్ శాసనసభ్యులు కాలేరు వెంకటేష్ గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ స్కైలాబ్



బాబు, హైదరాబాద్ నగర కార్యదర్శి బి సుబ్బారావు, డిడిఎఫ్ జాతీయ కార్యదర్శి పి శంకర్, రాష్ట్ర నాయకురాలు పులి కల్పన, మాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బత్తుల రాంప్రసాద్, పీపుల్స్ మానిటరింగ్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఎస్ శివలింగం,దళిత బహుజన శ్రామిక యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జి నరసింహ, తెలంగాణ అసంఘటిత రంగ కార్మికుల సమాఖ్య రాష్ట్ర నాయకులు కే సి ఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# సాగునీటి కోసం రోడ్డెక్కిన రైతులు

* **గోదావరి నీళ్లు అందించాలని డిమాండ్**
* **రోడ్డును దిగ్బంధం చేసిన రైతాంగం**
* **పోలీసుల రంగ ప్రవేశం**
* **చెరుకు శ్రీనివాస్ రెడ్డి హామీతో ఆందోళన విరమణ**





రాయపోల్. మార్చి ,17. సమయం న్యూస్. తలపున గోదావరి నీళ్లు వస్తున్నప్పటికీ తమ పంట పొలాలకు నీరు రావడంలేదని మెదక్ జిల్లా చేగుంట మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులు దౌల్తాబాద్ మండలం ఇందుప్రియల్ చౌరస్తాలోని రామయంపేట కెనాల్ వద్ద సోమవారం రోడ్డుపై టెంట్లు వేసి బైఠాయించి సాగు నీటి కోసం పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. చేగుంట గజ్వేల్ ప్రధాన రహదారి కిలోమీటర్ల పొడవున్న వాహనాలు ఎక్కడెడక్కడ నిలిచిపోయాయి. చేగుంట మండలంలోని పోతన్ పల్లి, పోతంశెట్టిపల్లి, మక్కరాజుపేట, చందాయిపేట , సాన్ పల్లి, దౌల్తాబాద్ మండలం మాచిన్ పల్లి తదితర గ్రామాలకు చెందిన 500 మంది రైతులు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు రోడ్డుపై బైఠాయించి తమ పంట పొలాలకు గోదావరి ద్వారా సాగునీరు అందించి తన పంటలను కాపాడాలని రైతులు డిమాండ్ చేశారు. నాయకులు, ఫారెస్ట్ అధికారులు, రెవెన్యూ అధికారులు, ఇరిగేషన్ అధికారులు తమ బాధలను దృష్టిలో పెట్టుకొని పరిష్కారం చేయాలని లేని పక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఆయా గ్రామాల ప్రజలు ప్రజాప్రతినిధులు పార్టీలకు అతీతంగా రోడ్డుపై టెంట్ వేసుకొని బైటాయించడంతో కిలో మీటర్ల పొడవునా వాహనాలు ఎక్కడికి అక్కడ నిలిచిపోయాయి. ఈ విషయం తెలుసుకున్న తొగుట సిఐ లతీఫ్, ఎస్సై శ్రీరామ్ ప్రేమ్ దీప్ లు సంఘటనా స్థలానికి చేరుకొని రైతులను సముదాయించారు. తమకు కాలువల ద్వారా నీరు అందించేం దుకు అధికారుల దృష్టికి తీసుకుపోయి సమస్యను పరిష్కరించాలని రైతులు పేర్కొన్నారు. రైతుల డిమాండ్లను సామరస్యంగా పరిష్కరించే విధంగా కృషి చేస్తామని సీఐ రైతులకు సూచించారు. దీంతో రైతులు రోడ్డుపైనే బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. రైతులకు న్యాయమైన సమస్యలను పరిష్కరిస్తా.. కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి రామాయంపేట కెనాల్ ద్వారా చేగుంట మండలంలోని పలు గ్రామాలకు గోదావరి సాగునీరు అందించే విధంగా కృషిచేస్తామని దుబ్బాక కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ చెరుకు శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చారు. సాగు నీరు కోసం రోడ్డుపై రైతులు ధర్నా చేస్తున్న విషయం తెలుసుకొని ఆయన ఇందుప్రియల్ చౌరస్తా లో ఆందోళన చేస్తున్న రైతుల వద్దకు వెళ్లి వారి బాధలను విన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రైతులు చేపడుతున్న ఆందోళన న్యాయమేనని, కానీ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి అన్ని గ్రామాలకు సాగు నీరు వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఎప్పటికీ సాగునీరు వచ్చే విధంగా వచ్చే సంవత్సరం జనవరి కల్లా రైతులు ఆగాల్సి ఉంటుందని ఆయన రైతులకు హామీ ఇచ్చారు. అనంతరం రైతులతో కలిసి రామాయంపేట కెనాల్ కాలువను పరిశీలించారు. ఆయా గ్రామాల నాయకులు, రైతులతో పాటు ఇరిగేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధురాలికి వీల్‌చైర్ నిరాకరణ..

## ఎయిరిండియాకు నోటీసులు జారీ చేస్తాం: కేంద్రం




దిల్లీ: ఎయిర్‌పోర్ట్‌లో వీల్‌చైర్ సదుపాయం నిరాకరించడంతో ఇటీవల ఓ వృద్ధురాలు కింద పడిపోయిన సం గతి తెలిసిందే. గాయాలపాలైన ఆమె ప్రస్తుతం కోలుకుంటున్నారు. ఈ ఘట నపై రాజ్యసభలో చర్చ జరిగింది. ఈ వ్యవహారానికి సంబంధించి ఎయిరిండి యాకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు సోమవారం సభలో వెల్లడించారు. రాజ్యసభలో ప్రశ్నోత్తరాల సమయంలో కేంద్రమంత్రి మాట్లాడారు. ''దిల్లీ ఎయిర్‌పోర్టులో జరిగిన ఘటన బాధాకరం. పౌర విమానయాన మార్గదర్శకాల ప్రకారం.. ప్రతి ఎయిర్‌లైన్స్ అవసరం ఉంటే ప్రయాణికులకు వీల్‌చైర్ అందించాల్సి ఉంటుంది. ఈ వ్యవహారాన్ని లోతుగా పరిశీలిస్తున్నాం. అసలేం జరిగిందో తెలుసుకుంటాం. ఈ ఘటనకు సంబంధించి బాధిత కుటుంబంతో డీజీసీఏ మాట్లాడింది. అదే విధంగా విమానయాన సంస్థ నుంచి వివరణ స్వీకరించింది. అసలేం జరిగిందో తెలుసుకునేందుకు సీసీటీవీ ఫుటేజ్ పరిశీలిస్తున్నాం'' అని రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. ఎయిరిండియాకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని.. పూర్తి విచారణ అనంతరం చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాగా.. ఇటీవల దిల్లీ ఎయిర్‌పోర్టులో ఓ వృద్ధురాలికి వీల్‌చైర్ సదుపాయం కల్పిం చకపోవడంతో నడుచుకుంటూ వెళ్లిన ఆమె కింద పడిపోయారు. గాయపడిన ఆమెకు చికిత్స అందుతోంది. ఈ విషయాన్ని ఆమె మనవరాలు పరుల్ 'ఎక్స్' (ట్విటర్) వేదికగా వెల్లడించారు. దిల్లీ నుంచి బెంగళూరు వెళ్లేందుకు ఎయిరిండియా విమానంలో టికెట్‌తో పాటు వీల్‌చైర్‌నూ బుక్ చేసుకున్నామని తెలిపారు. అయితే, ఎయిర్‌పోర్టులో చక్రాల కుర్చీ ఇచ్చేందుకు ఎయిరిండియా సిబ్బంది నిరాకరించారని ఆరోపించారు. దీంతో ఆమె నడుచుకుంటూ రావడంతో ఒక్కసారిగా కిందపడిపోయారని వివరించారు.

# బెంగాల్‌లో శాంతిభద్రతలు కరువయ్యాయి.. దీదీ పాలనపై సీఎం యోగి విమర్శలు

దిల్లీ: ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీపై తీవ్ర విమర్శలు గుప్పించారు. హోలీ సందర్భంగా బెంగాల్‌లో చోటు చేసుకున్న ఘర్షణలను ఆయన ఎత్తి చూపుతూ విమర్శించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలను సీఎం మమతా కాపాడుకోలేక పోయారంటూ ఎద్దేవా చేశారు. పండుగ రోజు బెంగాల్‌లోని బీర్భమ్‌లో రెండు వర్గాలకు చెందిన ప్రజల మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘటనపై తాజాగా స్పందించిన సీఎం యోగి.. దీదీ పాలనను ఉద్దేశిస్తూ విమర్శలు చేశారు. ''ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన మహాకుంభ మేళాలో తొక్కిసలాట ఘటనను ఉద్దేశిస్తూ ఇటీవల మమతా బెనర్జీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని మరణోత్సవమంటూ తక్కువ చేసి మాట్లాడారు. కానీ, ఆమె నేతృత్వంలోని ప్రభుత్వం రాష్ట్రంలో జరిగిన రెండు వర్గాల మధ్య పోరును అడ్డుకోలేకపోయింది'' అని యోగి ఆదిత్యనాథ్ విమర్శల బాణాలు సంధించారు. ''మహాకుంభ మేళాలో మొత్తం 66 కోట్లకు పైగా మంది భక్తులు పాల్గొన్నారు. కానీ, ఒక్క నేరం కూడా జరగలేదు. ప్రపంచంలోనే అతి పెద్ద ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని నిర్వహించే సామర్థ్యం యూపీ ప్రభుత్వానికి ఉంది. కానీ, బెంగాల్‌లో హింసాత్మక ఘటనలు ఇంకా జరుగుతున్నాయి. మా రాష్ట్రంలో హోలీని ఎంతో ఆనందంగా నిర్వహించాం. అయితే.. దీదీ ప్రభుత్వం మాత్రం పండుగల వేళ కర్ఫ్యూలు విధించే పరిస్థితి నెలకొంది. ప్రజలపై ఆంక్షలు విధిస్తుంటుంది. అయినప్పటికీ, నేరాలు నివారించలేకపోయింది. ప్రజల మనోభావాలను గుర్తించి గౌరవించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంటుంది. పాలన అంటే విభజించడం కాదు. చెడు మనస్తత్వాలు కలిగిన వ్యక్తులతో కలిసి పని చేస్తే మంచి ఫలితాలు ఉండవు'' అని హితవు పలికారు. ఇదిలా ఉండగా.. హోలీ రోజున బెంగాల్‌లో రెండు వర్గాల ప్రజల మధ్య ఘర్షణ నెలకొంది. ఘటనాస్థలానికి వెళ్లిన పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకున్నారు.

# బిజినెస్ BUSINESS

## మైక్రో రిటైర్మెంట్.. ఉద్యోగ జీవితంలో కొత్త ట్రెండ్!



సాధారణంగా 60 ఏళ్లకు ఎవరైనా రిటైర్ అవుతారు. పనిచేసే ఓపిక ఉంటే ఆపై మరికొన్నేళ్లు కూడా ఉద్యోగంలో కొనసాగడానికి ప్రయత్నించేవారు. ఇదంతా ఒకప్పటి మాట. ఇప్పుడు కాలం మారింది. ఉద్యోగ జీవితంలో కొత్త ట్రెండ్ పుట్టుకొచ్చింది. అదే మైక్రో రిటైర్మెంట్. అంటే కెరీర్‌లో బ్రేక్ తీసుకుని కొన్నాళ్లు జీవితాన్ని ఆస్వాదించడం. తర్వాత మళ్లీ ఓ కొత్త ఉద్యోగంలో చేరిపోవడం. ముఖ్యంగా జనరేషన్ జెడ్ ఉద్యోగుల్లో ఈ ట్రెండ్ కనిపిస్తోందని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. సుదీర్ఘకాలం పాటు ఉద్యోగం చేసే వారు మధ్యలో కొంత విరామం కోరుకోవడం సహజమే. సహేతుక కారణం ఉంటే సంస్థలే ఉద్యోగి సెలవులకు అంగీకరిస్తాయి. స్వల్ప విరామం తర్వాత మళ్లీ అదే ఉద్యోగంలో చేరొచ్చు. ఇలాంటి సందర్భాల్లో ఉద్యోగానికి భద్రతా ఉంటుంది. 1328 ఏళ్ల వయసున్న జనరేషన్ జెడ్ (19972012 మధ్య జన్మించిన వారు) ఉద్యోగులు మాత్రం అందుకు విరుద్ధం. ఉద్యోగ జీవితానికి కొన్నాళ్ల పాటు పూర్తిగా విరామం తీసుకోవడం. మళ్లీ నచ్చినప్పుడు కొత్త ఉద్యోగం వెతుక్కోవడం. గ్యాప్ తర్వాత వారి ఉద్యోగానికి భద్రత ఉండదు. అయితే, మైక్రో రిటైర్మెంట్ కాలాన్ని జీవితాన్ని ఆస్వాదించడంతో పాటు కొత్త నైపుణ్యాలు నేర్చుకోవడంపైనా జనరేషన్ జెడ్ యువత దృష్టి పెడుతున్నారట.

**ఎందుకీ రిటైర్మెంట్?**

ఒకప్పటి జనరేషన్లతో పోలిస్తే జనరేషన్ జెడ్ ఉద్యోగులు కాస్త భిన్నం. వీరు ఎదుగుతున్న కాలంలో ప్రపంచంలో చాలా మార్పులు వచ్చాయి. వీరిలో మానసిక ఆరోగ్యం పట్ల, వర్క్ లైఫ్ బ్యాలెన్స్ పట్ల శ్రద్ధ ఎక్కువ. వీరిలో చాలా మంది కొవిడ్ మహమ్మారిని చూసిన తర్వాత ఉద్యోగంలో చేరిన వారే అధికం. దీంతో మునుపటి తరంలా కెరీర్‌ను కొనసాగించడం వీరికి ఇష్టముండదు. ఒత్తిడిని అధిగమించేందుకే ఇలా కెరీర్‌లో కొంత గ్యాప్ తీసుకుంటున్నారని నిపుణులు చెబుతున్నారు.

**ట్రెండింగ్‌లోకి ఇలా..**

మైక్రో రిటైర్మెంట్ ట్రెండ్ విస్తృతం అవ్వడానికి సోషల్ మీడియానే కారణం. టిమ్ ఫెర్రిస్ అనే అమెరికన్ రచయిత 2007లో రచించిన 'ది ఫోర్ అవర్ వర్క్ వీక్' పుస్తకంలో తొలుత మైక్రో రిటైర్మెంట్ గురించి ప్రస్తావించారు. సోషల్‌మీడియా పుణ్యమా అని నేడు విస్తృతంగా ప్రాచుర్యంలోకి వచ్చింది. 'వయసులో ఉన్నప్పుడే ఎంజాయ్ చేయాలి బ్రో' అంటూ కొందరు చేస్తున్న వీడియోలు ఇతరులపై ప్రభావం చూపుతున్నాయి.

# స్వయం ఉపాధి పొందేవారు..

## ఏ పథకాలు ఎంచుకోవాలి?



ప్రతినెలా స్థిరమైన జీతం ఉన్న వ్యక్తులతో పోలిస్తే స్వయం ఉపాధి పొందుతున్న వ్యక్తులు క్రమం తప్పకుండా ఆదాయం సంపాదించడానికి, పొదుపు చేయడానికి కొన్ని ఇబ్బందులుంటాయి. ఇలాంటి వారు స్వల్ప, దీర్ఘకాల వ్యవధికి ఈపీఎఫ్ వంటి అధిక భద్రతనిచ్చే పొదుపు పథకంలో పెట్టుబడి పెట్టడానికి అవకాశముండదు. వృద్ధాప్యంలో రోజువారీ ఖర్చులకు ఇబ్బందులు పడే ఇలాంటివారు చాలామంది ఉంటారు. కాబట్టి, వీరు పనిచేసే వయసులో ఉన్నప్పుడు స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ఆర్థిక లక్ష్యాలను సాధించడానికి తగిన పెట్టుబడులను ఎంచుకోవాల్సి ఉంటుంది. అంతేకాకుండా, కొన్నిసార్లు ఊహించని ఆర్థిక సంక్షోభాలు ఏర్పడుతుంటాయి. వీటిని ఎదుర్కోవడానికి అత్యవసర నిధి కూడా అవసరమే. మీరు స్వయం ఉపాధి పొందుతున్న వ్యక్తి అయితే ఈ పెట్టుబడి ఆప్షన్లను పరిగణించొచ్చు.

**పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్**

పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (PPF) అనేది ప్రభుత్వ నియంత్రణలో ఉన్న పొదుపు పథకం. ఇది సురక్షితమైన స్థిరఆదాయ పెట్టుబడులలో ఒకటి. ఈ పథకానికి కేంద్ర ప్రభుత్వ హామీ కూడా ఉంది. సంప్రదాయ పథకాలను ఇష్టపడే స్వయం ఉపాధి పొందుతున్నవారు.. బ్యాంక్ ఎఫ్‌డీలు, ఇతర స్థిరఆదాయ పెట్టుబడుల కంటే ఎక్కువ రాబడిని పొందడానికి PPFలో పెట్టుబడిని పరిగణించవచ్చు. PPF ప్రస్తుతం 7.1% వడ్డీ రేటును అందిస్తోంది. దీనికి 15 సంవత్సరాల లాక్‌ఇన్ ఉంది. పదవీ విరమణ వంటి దీర్ఘకాలిక ఆర్థిక లక్ష్యాలకు ఇది తగిన ఎంపిక. ఏడాదికి కనిష్ఠంగా రూ.500 నుంచి, గరిష్ఠంగా రూ.1.50 లక్షల వరకు ఇందులో పెట్టుబడి పెట్టవచ్చు. మీరు మీ PPF ఖాతాను తెరిచిన తర్వాత మూడో సంవత్సరం నుంచి ఆరో సంవత్సరం వరకు కొన్ని షరతులకు లోబడి PPF బ్యాలెన్స్‌పై రుణం పొందవచ్చు. ఇది ఆర్థిక సంక్షోభ సమయంలో మీకు సహాయపడుతుంది. ఐటీ చట్టంలోని సెక్షన్ 80C కింద సంవత్సరానికి గరిష్ఠంగా రూ. 1.5 లక్షల వరకు పన్ను మినహాయింపు పొందడానికి మీకు అర్హత ఉంటుంది. అంతేకాకుండా, సంపాదించిన వడ్డీ, మెచ్యూరిటీ ఆదాయంపై పూర్తి పన్ను మినహాయింపు ఉంటుంది. స్వయం ఉపాధి పొందే వ్యక్తులు తమ ఆదాయం నుంచి ప్రతి ఏడాది పీపీఎఫ్‌లో గరిష్ఠంగా రూ.1.5 లక్షలు డిపాజిట్ చేయడం ద్వారా 15 ఏళ్ల తర్వాత రూ.40.68 లక్షల మొత్తాన్ని అందుకోవచ్చు. దీన్ని పదవీ విరమణ తర్వాత నెలవారీ ఖర్చులకు ఉపయోగించుకోవచ్చు.

**నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ (NSC)**

మీరు భారతదేశంలోని ఏ పోస్టాఫీసులో నైనా స్థిరఆదాయ పెట్టుబడి అయిన నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ (NSC)లో పెట్టుబడి పెట్టవచ్చు. ఇది ప్రభుత్వ హామీతో కూడిన రాబడిని అందించే ప్రసిద్ధ పొదుపు పథకం. 'ఎన్ఎస్‌సీ' అనేది వన్ టైమ్ ఇన్వెస్ట్‌మెంట్. దీనికి ఐదు సంవత్సరాల లాక్‌ఇన్ వ్యవధి ఉంటుంది. 5 ఏళ్ల వ్యవధిలో తమ పెట్టుబడులపై పన్ను ఆదా చేయాలనుకునే వారికి, 5 సంవత్సరాల పన్ను ఆదా బ్యాంకు ఫిక్స్‌డ్ డిపాజిట్లు, 'ఎన్ఎస్‌సీ'లు కూడా పన్ను ఆదా ప్రయోజనాన్ని అందిస్తాయి. అయితే 'ఎన్ఎస్‌సీ' పన్ను ఆదా చేసే 5 సంవత్సరాల బ్యాంకు ఫిక్స్‌డ్ డిపాజిట్ కంటే ఎక్కువ వడ్డీ రేటును అందిస్తుంది. ఎన్ఎస్‌సీ వడ్డీ రేటు ప్రస్తుతం 7.7 శాతంగా ఉంది. ఈ వడ్డీ ప్రముఖ బ్యాంకుల ఎఫ్‌డీల వడ్డీ రేట్లతో పోలిస్తే ఎక్కువే అని చెప్పొచ్చు. ఆర్థిక అత్యవసర పరిస్థితుల్లో మీరు NSCపై రుణం కూడా పొందే అవకాశముంది. అంతేకాకుండా, ఇది సెక్షన్ 80C కింద ఆర్థిక సంవత్సరానికి రూ. 1.5 లక్షల వరకు పన్ను మినహాయింపును అందిస్తుంది. పెట్టుబడిదారులకు నెలవారీ లేదా వార్షిక ప్రాతిపదికన వడ్డీ చెల్లింపు ఉండదు. పెట్టుబడి పెట్టిన అసలుతో పాటు మెచ్యూరిటీ సమయంలో మాత్రమే చెల్లిస్తారు. ఎన్ఎస్‌సీలో కనీస పెట్టుబడి రూ. 1,000. ఇది 5 సంవత్సరాల తర్వాత రూ. 1459 అవుతుంది. ఇందులో పెట్టుబడి పెట్టడానికి గరిష్ఠ పరిమితి లేదు. కానీ సెక్షన్ 80సీ కింద పన్ను ప్రయోజనం ఆర్థిక సంవత్సరానికి రూ. 1.5 లక్షల వరకు మాత్రమే ఉంటుంది. హామీతో కూడిన మెరుగైన రాబడిని కోరుకునే స్వయం ఉపాధి పొందే వ్యక్తులు NSCలో పెట్టుబడిని పరిశీలించొచ్చు.

**బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్లు (FDs)**

ఎలాంటి ఉపాధి పొందేవారైనా బ్యాంక్ లేదా NBFCలో ఫిక్స్‌డ్ డిపాజిట్‌లో పెట్టుబడి పెట్టవచ్చు. ఇది మీ మూలధనాన్ని రక్షించే సురక్షితమైన పెట్టుబడి. ఒక నిర్దిష్ట కాలానికి బ్యాంకు హామీ ఉన్న వడ్డీ రేటును అందిస్తుంది. మీ పెట్టుబడి మొత్తం నిర్దిష్ట వడ్డీ రేటు వద్ద లాక్ అయి ఉంటుంది. మార్కెట్ హెచ్చుతగ్గుల ద్వారా ప్రభావితం కాదు. మీరు వ్యక్తిగత రుణాలు, క్రెడిట్ కార్డుల ద్వారా పొందే రుణాల కంటే తక్కువ వడ్డీ రేటుతో బ్యాంక్ FDని హామీగా ఉంచి రుణం కూడా తీసుకోవచ్చు. పన్ను ఆదా చేసే FDలో మీ పెట్టుబడిపై ప్రతి ఆర్థిక సంవత్సరానికి రూ.1.5 లక్షల వరకు పన్ను మినహాయింపును కూడా పొందుతారు.

## నాలుగో నెలా తగ్గిన ఎగుమతులు



దిల్లీ: మన దేశ ఎగుమతులు వరుసగా నాలుగో నెలా తగ్గాయి. పెట్రోలియం ధరల్లో ఊగిసలాటలు, అంతర్జాతీయ అనిశ్చితులతో ఈ ఏడాది ఫిబ్రవరిలో ఇవి 36.91 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. 2024 ఇదే నెలలో ఎగుమతులు 41.41 బి. డాలర్లుగా ఉన్నాయి. దిగుమతులు సైతం గతేడాది ఫిబ్రవరి నాటి 60.92 బి. డాలర్ల నుంచి గత నెలలో 50.96 బి. డాలర్లకు తగ్గడంతో వాణిజ్య లోటు 14.05 బి. డాలర్లకు దిగివచ్చిందని వాణిజ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. ఎందుకు తగ్గాయంటే..: ఆగస్టు 2021 తర్వాత వాణిజ్య లోటుకు ఇదే కనిష్ఠ స్థాయి అని ఉన్నతాధికారి ఒకరు పేర్కొన్నారు. ఫిబ్రవరి 2024లో ఎక్కువ ప్రాతిపదిక ఉండడంతో పాటు పెట్రోలియం ధరలు, బంగారం వెండి వంటి విలువైన లోహ ధరల్లో మార్పుల వల్ల ఈ ఏడాది ఫిబ్రవరిలో 10 బి. డాలర్ల మేర దిగుమతుల్లో క్షీణత కనిపించిందన్నారు. దీంతో వాణిజ్య లోటు 42 నెలల కనిష్ఠ స్థాయికి చేరింది. ఫిబ్రవరి 2024లో లోటు 19.5 బి. డాలర్లుగా ఉంది.

# ఏఐ రేసులో గట్టి పోటీ..

## రెండు కొత్త మోడళ్లను లాంచ్ చేసిన బైదూ




ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో గట్టి పోటీ నెలకొంది. ఏఐ రేసులో నిలబడేందుకు ఇప్పటికే అనేక సంస్థలు కొత్త మోడళ్లను పరిచయం చేస్తూ యూజర్లను ఆకట్టుకొనే ప్రయత్నాలు చేస్తున్నాయి. తాజాగా చైనా అతిపెద్ద సెర్చ్‌ంజిన్ బైదూ రెండు కొత్త కృత్రిమ మేధ మోడళ్లను లాంచ్ చేసింది. ERNIE 4.5, X1 అనే రెండు కొత్త రీజనింగ్ ఫోకస్డ్ మోడళ్లను తీసుకొచ్చినట్లు ఆదివారం తెలిపింది. అద్భుతమైన మల్టీమోడల్ సామర్థ్యంతో ERNIE 4.5 మోడల్‌ను తీసుకొచ్చినట్లు బైదూ తెలిపింది. అధునాతన భాషా సామర్థ్యాన్ని, ప్రతి విషయాన్ని అర్థం చేసుకొనే సత్తా, అద్భుతమైన మెమోరీ కలిగి ఉన్నాయని కంపెనీ పేర్కొంది. అధిక ఐక్యూ కలిగిఉందని వెల్లడించింది. ఈ మల్టీమోడల్ ఏఐ సిస్టమ్‌లు టెక్స్ట్, వీడియో, ఇమేజెస్, ఆడియోతో సహా వివిధ రకాల డేటాను ప్రాసెస్ చేయగలవని తెలిపింది. ఇక ఎక్స్1 మోడల్‌కు సమర్థవంతమైన విషయాన్ని అవగాహన చేసుకొనే సత్తా, ప్రణాళికలు రచించే సామర్థ్యాల్ని కలిగి ఉంటుందని తెలిపింది. ఇది స్వయంప్రతిపత్తిగా ఉపయోగించే ఫస్ట్ డీప్ థింకింగ్ మోడళ్లలో ఒకటి అని బైదూ పేర్కొంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) రంగంలో ఇప్పటికే పలు సంస్థలు తమ సత్తా చాటుతున్నాయి. చాట్‌బాట్ సేవలతో చాట్‌జీపీటీని సంచనలం సృష్టించింది. దీన్ని రూపొందించిన ఓపెన్‌ఏఐ సంస్థ అనతికాలంలోనే ప్రాచుర్యం పొందింది. తర్వాత మైక్రోసాఫ్ట్, గూగుల్, మెటా, అమెజాన్ వంటి సంస్థలు ఏఐలోకి ఎంట్రీ ఇచ్చాయి. తాజాగా చైనాకు చెందిన స్టార్టప్ సంస్థ డీప్‌సీక్ (Deepseek)ను తీసుకొచ్చిన ఈ రంగంలో గట్టి పోటీని నెలకొల్పింది. తక్కువ ఖర్చుతో లేటెస్ట్ ఏఐ మోడల్‌ను రూపొందిం టెక్ మార్కెట్‌ని కుదిపేసింది.

## ఏఐ తోడుంటే.. విజయం మీవెంటే..




ఆన్‌లైన్ గేమర్ల గేమింగ్ అనుభవాన్ని మెరుగుపరచడానికి ఏఐ ఆధారిత అసిస్టెంట్ 'కోపైలట్ ఫర్ గేమింగ్'ను మైక్రోసాఫ్ట్ ఆవిష్కరించింది. ఇది ఆన్‌లైన్‌లో ప్లేయర్లకు సమయాన్ని ఆదా చేయడం, వారి నైపుణ్యాలను మెరుగుపరచడం, ఇతర స్నేహితులు, గేమింగ్ కమ్యూనిటీలతో కనెక్ట్ అవ్వడంలో సహాయపడుతుందని కంపెనీ పేర్కొంది. మైక్రోసాఫ్ట్ ఛైర్మన్, సీఈఓ సత్య నాదెళ్ల సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో ఈ ఏఐ టూల్‌కు సంబంధించిన విషయాలు పంచుకున్నారు. కోపైలట్ ఫర్ గేమింగ్ అనేది గేమింగ్ ప్రక్రియను సులభతరం చేయడానికి, రియల్‌టైమ్‌లో గేమర్లకు మద్దతుగా నిలిచేందుకు, వారి గేమింగ్ నైపుణ్యాలు పెంచేందుకు ఉద్దేశించిన ఏఐ ఆధారిత టూల్. ఈ ఏఐ అసిస్టెంట్ ప్లేయర్లకు మరింత వేగంగా గేమ్స్ సెట్ చేయడానికి, వారి ప్రాధాన్యతల ఆధారంగా కొత్త టైటిల్స్‌ను సిఫారసు చేయడానికి, అవసరమైనప్పుడు గేమ్‌లో సహాయాన్ని అందించడానికి తోడ్పడుతుందని కంపెనీ వర్గాలు తెలిపాయి. కోపైలట్ ఫర్ గేమింగ్ ప్రారంభంలో ఎక్స్ బాక్స్ ఇన్ సైడర్ ప్రోగ్రామ్ ద్వారా మొబైల్‌లో అందుబాటులో ఉంటుందని అధికారులు తెలిపారు. ఇతర ప్లాట్‌పామ్‌లకు త్వరలో దీన్ని విస్తరిస్తామని పేర్కొన్నారు. ఈ ఏఐ అసిస్టెంట్‌ను సామర్థ్యం, అడాప్టబిలిటీ, పర్సనలైజేషన్ అనే మూడు ప్రధాన సూత్రాలకు అనుగుణంగా నిర్మించినట్లు కంపెనీ పేర్కొంది.

# టెక్నాలజీ

## భారత్‌లో యాపిల్–గూగుల్ భాగస్వామ్యం..?

భారత్‌లోని ఐఫోన్‌ల్లో రిచ్ కమ్యూనికేషన్ సర్వీసెస్ (ఆర్‌సీఎస్) మెసేజింగ్‌ను తీసుకురావడానికి యాపిల్ గూగుల్‌తో చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. ఈ భాగస్వామ్యం మెసేజింగ్ సాంకేతికతలో మార్పును సూచిస్తుంది. ఈ చర్యలు ప్రపంచంలోని అతిపెద్ద స్మార్ట్ ఫోన్ మార్కెట్లలో ఒకటైన ఐఓఎస్, ఆండ్రాయిడ్ వినియోగదారుల సంఖ్యను పెంచేలా వీలు కల్పిస్తాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుత ఐఓఎస్ 18.2 వెర్షన్‌లో పీ2పీ (పర్సన్‌టుపర్సన్) ఆర్‌సీఎస్‌ను యూఎస్, కెనడా, జర్మనీ, స్పెయిన్, ఫ్రాన్స్, యుకె, బెల్జియం, చైనా వంటి ఎనిమిది దేశాల్లో ప్రారంభించారని గ్లోబల్ ఆర్‌సీఎస్ ప్లాట్‌ఫామ్ ప్రొవైడర్ డాట్గో సీఈఓ ఇందర్పాల్ ముమిక్ పేర్కొన్నారు. ఇందుకోసం యాపిల్ 'ఐమెసేజ్' క్లయింట్ గూగుల్ బ్యాక్ ఎండ్ సర్వర్లలో పనిచేయడానికి పరస్పరం ఇరు కంపెనీలు సహకరించుకున్నట్లు తెలిపారు. ఈ దేశాల్లో ఆర్‌సీఎస్ కోసం క్యారియర్ నెట్‌వర్క్‌లను అనుసంధానించినట్లు చెప్పారు. అయితే గూగుల్‌కు అంతగా ఆదరణ లేని చైనాలో ప్రత్యామ్నాయ సర్వర్ వెండర్లను ఎంచుకున్నట్లు పేర్కొన్నారు. జీఎస్ఎం అసోసియేషన్ అభివృద్ధి చేసిన అధునాతన ప్రోటోకాల్ ఆర్‌సీఎస్ మెసేజింగ్ హైరిజల్యూషన్ మీడియా షేరింగ్, రీడ్ రసీదులు, టైపింగ్ ఇండికేటర్స్, ఇంటర్నెట్ ఆధారిత సందేశాలు వంటి ఫీచర్లను అందిస్తుంది. సాంప్రదాయ ఎస్ఎంఎస్, ఎంఎంఎస్ మాదిరిగా కాకుండా ఆర్‌సీఎస్ మొబైల్ డేటా లేదా వైఫై ద్వారా పనిచేస్తుంది. ఇది అంతరాయంలేని మెరుగైన కమ్యూనికేషన్ అనుభవాన్ని అందిస్తుంది.



# MOVIE TIME

## సల్మాన్‌ఖాన్ నుంచి ఎన్నో విషయాలు నేర్చుకోవచ్చు : రష్మిక



బాలీవుడ్ అగ్ర కథానాయకుడు సల్మాన్ ఖాన్ హీరోగా రానున్న చిత్రం 'సికందర్'. ఇందులో సల్మాన్ సరసన రష్మిక కనిపించనున్నారు. ఇటీవల హోలీ సందర్భంగా ఈ సినిమా నుంచి 'భం భం భోలే శంభు..' అనే పాటను విడుదల చేసిన సంగతి తెలిసిందే. తాజాగా ఆ పాట బీటీఎస్‌ను చిత్రబృందం పంచుకుంది. ఆ బీటీఎస్ వీడియో షేర్ చేసిన రష్మిక ఈ హీరో గురించి మాట్లాడారు. 'సల్మాన్ ఖాన్ నుంచి ఎన్నో కొత్త విషయాలు నేర్చుకోవచ్చు. సెట్‌లో ఎంతో ఎనర్జీతో ఉంటారు' అని కామెంట్ చేశారు. ఈ కామెంట్ అభిమానుల్లో ఉత్సాహం పెంచింది. ఇక గతంలోనూ సల్మాన్ గురించి రష్మిక మాట్లాడారు. ఆయనతో నటించడం తన కల అని పేర్కొన్నారు. పెద్ద స్టార్ హీరో అయినా.. ఒదిగి ఉంటారన్నారు. షూటింగ్‌లో తనకు ఆరోగ్యం బాగా లేకపోతే సల్మాన్ ఇంటి నుంచి భోజనం తెప్పించేవారని తెలిపారు. యాక్షన్ థ్రిల్లర్ 'సికందర్' ముస్తాబవుతోంది. ఇటీవల దీని షూటింగ్ పూర్తయింది. రంజాన్ కానుకగా ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది. ఇటీవల విడుదల చేసిన పాటలో సల్మాన్, రష్మిక స్టెప్పులు అలరించాయి. మధ్యలో కథానాయిక కాజల్ అగర్వాల్ తళుక్కున మెరిశారు. ప్రస్తుతం ఈ పాట మిలియన్‌ల వ్యూస్‌తో సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో ఉంది.




## సినిమా

# విలన్‌గా బన్నీ?!



తగ్గేదేలే..! అంటూ పాన్ ఇండియా స్టార్‌గా ఎదిగిన పుష్పరాజ్ విలన్ గా కనిపించబోతున్నాడనే గుసగుసలు వినిపిస్తున్నాయి. అయితే పుష్ప-2 బాక్సాఫీసు వద్ద ప్రభంజనం సృష్టించిన విషయం తెలిసిందే. ప్రతిష్ఠాత్మక యష్‌రాజ్ ఫిలింస్ రూపొందించనున్న 'పఠాన్2' లో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ని విలన్ గా నటింపజేసే ప్రయత్నాలు సాగుతున్నాయనేది ఈ గాసిప్ సారాంశం. కింగ్ ఖాన్ షారూఖ్ 'పఠాన్' చిత్రంతో 1000 కోట్ల క్లబ్ అందుకున్నాడు. ఇప్పుడు పఠాన్ సీక్వెల్ తో పాన్ ఇండియాలో మరో భారీ విజయాన్ని నమోదు చేయాలని ఉవ్విళ్లూరుతున్నాడు. దీనికోసం పుష్పరాజ్ పాత్రలో సంచలనం సృష్టించిన అల్లు అర్జున్ ని విలన్ గా ఎంపిక చేయాలని యష్‌రాజ్ బ్యానర్ భావిస్తున్నట్టు కథనాలు వేడెక్కిస్తున్నాయి. పఠాన్ లో జాన్ అబ్రహాం విలన్ గా నటించాడు. అతడి నటనకు మంచి పేరొచ్చింది. ఇప్పుడు సీక్వెల్ లో పుష్పరాజ్ అలియాస్ బన్ని ఎంట్రీ ఇస్తే అది సౌత్ ఆడియెన్స్ కి మరో లెవల్ ట్రీట్ గా మారుతుంది. తద్వారా దక్షిణాది నుంచి భారీగా వసూళ్లను కొల్లగొట్టాలనే ప్లాన్ యష్ రాజ్ బ్యానర్ కి ఉంది. అందుకే అల్లు అర్జున్ ని ఒప్పించే ప్రయత్నాలు చేస్తోందనేది హాట్ టాపిక్ గా మారింది. అయితే విలన్ పాత్రలో నటించేందుకు అల్లు అర్జున్ ఒప్పుకుంటారా..? లేదా..? అన్నది సందేహాస్పదమే..!



**వైష్ణవి చైతన్య: ప్రతి లుక్‌లో అప్రయత్నంగా లావణ్యం మరియు విశ్వాసం ఆమె అనేక ఫోటోషూట్‌లలో, వైష్ణవి ధైర్యంగా మరియు శక్తివంతమైన రంగులను ఆలింగనం చేసుకుంటుంది, ఆత్మవిశ్వాసం మరియు గాంభీర్యాన్ని వెదజల్లుతుంది.**



# కొలంబోలో కీర్తి



పైలట్ సినిమాతో 2000 సంవత్సరంలో బాలనటిగా ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చిన భామ కీర్తి సురేశ్. 2013లో గీతాంజలి సినిమాతో హీరోయిన్ గా కెరీర్ ను ప్రారంభించిందీ మలయాళ భామ. తర్వాత నేను శైలజ, నేను లోకల్ అజ్ఞాత వాసి సినిమాల్లో యాక్ట్ చేసింది. తర్వాత ఆమె నటించిన మహానటి సినిమా కెరీర్ ను మలుపు తిప్పింది. మహానటి సావిత్రి బయోపిక్ గా వచ్చిన ఈ సినిమా లో ఆమె అద్భుతంగా నటించింది. ఇటీవలే బేబీ జాన్ చిత్రంలో కనిపించింది. ఇది 2024లో విడుదలైన హిందీ యాక్షన్ థ్రిల్లర్. కలీస్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. ఇది తమిళ చిత్రం థెరికి రీమేక్. వరుణ్ ధావన్ ప్రధాన పాత్ర పోషించారు. బేబీ జాన్ సినిమాతో కీర్తి బాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చింది. సినిమాల్లో నటిస్తూనే సోషల్ మీడియాలోనూ యాక్టివ్ గా ఉంటోందీ భామ. తన ఇన్ స్టా గ్రాం ఖాతాలో కొలంబోలో దిగిన ఫొటోలను ఇవాళ పోస్ట్ చేసింది. ఆమె బంగారు ఎంబ్రాయిడరీతో ముదురు ఆకుపచ్చ రంగు డ్రెస్ వేసుకుంది. స్టైలిష్ బ్లేజర్, మడతల డ్రేప్ ఉన్నాయి. ఆమె జుట్టును సొగసైన పోనీటైల్‌లో కట్టుకుంది. "ఆయుబోవాన్ కొలంబో, మీరు చాలా వైబ్" అని క్యాప్షన్ ఇచ్చింది. ఈ ఫొటోలు ఇప్పుడు వైరల్ గా మారాయి.

# బీసీసీఐ 'ఫ్యామిలీ రూల్'పై కోహ్లీ కామెంట్లు..
# అనుష్క శర్మ పోస్ట్ వైరల్

టీమ్‌ఇండియా స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ ఇటీవల ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ తన వ్యక్తిగత, కెరీర్ విషయాలను పంచుకున్న సంగతి తెలిసిందే. తన ఆట తీరు, రిటైర్మెంట్ విషయాలతో పాటు బీసీసీఐ తీసుకొచ్చిన 'ఫ్యామిలీ రూల్'పైనా కీలక వ్యాఖ్యలు చేశాడు. ఆ ఇంటర్వ్యూ ప్రస్తుతం చర్చనీయాంశమైన వేళ కోహ్లీ సతీమణి అనుష్క శర్మ ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టిన పోస్ట్ ఆసక్తికరంగా మారింది. కోహ్లీ వ్యక్తిత్వాన్ని ఉద్దేశిస్తూ ఆమె సుదీర్ఘ పోస్ట్ రాసుకొచ్చింది. ''నువ్వు తెలిసిన ప్రతి ఒక్కరి మనసులో నీ గురించి భిన్నమైన అభిప్రాయాలు ఉంటాయి. నువ్వు ఎవరినైతే నీలా చూస్తావో వారే నీకోసం ఉంటారు. ఆ వ్యక్తి ఎవరో నీకు నిజంగా తెలియదు. నువ్వు కలిసేవారు, నీతో పరిచయం ఉన్నవారు.. చివరకు వీధిలో నిన్ను చూసిన వారు కూడా.. నీ గురించి వారి మనసులో



సొంత అభిప్రాయాన్ని ఏర్పరుచుకుంటారు. మీ అమ్మకు, నాన్నకు, తోబుట్టువులకు, సహోద్యో గులకు లేదా స్నేహితులకు నువ్వు ఒకేలా కన్పించవు. ప్రజలకు నువ్వు వెయ్యి రకాలుగా కనిపించవచ్చు. ఒక్కొక్కరిలో ఒక్కో రూపంగా కనిపిస్తున్నా, అందరిలోనూ ఉన్నది నువ్వే. అయితే, ఆ నువ్వు మాత్రం ఎప్పటికీ ఇంకొకరివి కాలేవు'' అని అనుష్క రాసుకొచ్చింది. ప్రస్తుతం ఈ పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారింది. ఇటీవల ఆస్ట్రేలియా పర్యటనలో టీమ్‌ఇండియా ఓటమి అనంతరం కుటుంబ సభ్యులతో భారత క్రికెటర్లు ఉండే సమయాన్ని బీసీసీఐ తగ్గించిన సంగతి తెలిసిందే. దీనిపై కోహ్లీ అసంతృప్తి వ్యక్తం చేశాడు. కుటుంబ సభ్యుల పాత్ర ఎలాంటిదో జనాలకు అర్థమయ్యేలా చెప్పడం చాలా కష్టమని అన్నాడు. మైదానంలో కష్టంగా గడిచిన రోజుల్లో ఒంటరిగా గదిలో ఇబ్బంది పడే బదులు కుటుంబ సభ్యులతో ఉండడానికి ఇష్టపడతానని చెప్పాడు. ఇక, మైదానం తన ప్రవర్తన గురించి స్పందిస్తూ.. 'గతంలో దూకుడు సమస్యగా ఉండేది. ఇప్పుడు ప్రశాంతత కూడా అందరికీ సమస్యగా మారింది' అని వ్యాఖ్యానించాడు.

## థాంక్యూ ధోనీ.. అప్పుడు రాలేదు.. ఇప్పుడు బెస్ట్ 'గిఫ్ట్' ఇచ్చావు: అశ్విన్



చాన్నాళ్ల తర్వాత మళ్లీ చెన్నై సూపర్ కింగ్స్ జట్టుకు ప్రాతినిధ్యం వహించేందుకు రవిచంద్రన్ అశ్విన్ సిద్ధమైపోయాడు. అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన తర్వాత అశ్విన్ తొలిసారి ఐపీఎల్ ఆడబోతున్నాడు. ఈ క్రమంలో టీమ్ ఇండియా మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ గురించి అశ్విన్ ఓ ఆసక్తికర విషయాన్ని పంచుకొన్నాడు. వందో టెస్టు సందర్భంగా బీసీసీఐ ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటుచేసి అశ్విన్‌కు జ్ఞాపికను అందజేసింది. అయితే, ఆ మెమొంటోను ధోనీ చేతులమీదుగా తీసుకోవాలని అశ్విన్ భావించాడట. కానీ, అలా జరగలేదు. ఇదే విషయాన్ని అశ్విన్ తాజాగా వెల్లడించాడు. ''ధర్మశాల వేదికగా మ్యాచ్ జరిగింది. అది నా వందో టెస్టు. ధోనీ చేతులమీదుగా మెమొంటో తీసుకోవాలని భావించా. అదే నా చివరి మ్యాచ్ అవుతుందని అనుకున్నా. అయితే, ఆ టెస్టుకు ధోనీ రాలేదు. ఇప్పుడు మాత్రం నన్ను సీఎస్కేకు మళ్లీ తీసుకొని ఇలాంటి మంచి బహుమతి ఇస్తాడని అనుకోలేదు. ఎంఎస్ ధోనీకి ధన్యవాదాలు. నీవల్లే ఇక్కడున్నా. మరీ ముఖ్యంగా ఒక విషయం చెప్పాలి. ఇప్పటివరకు నేను చాలా క్రికెట్ ఆడా. ఎంతో సాధించా.. కానీ అదంతా పక్కనపెట్టేసి ఇప్పుడు ఆటను ఆస్వాదించాలని భావిస్తున్నా'' అని అశ్విన్ వెల్లడించాడు.